# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్
శుక్రవారం
18-10-2024
వెల. రూ.5
• సంపుటి : 8 • సంచిక: 298
పేజీలు : 8

Hyderabad | Karimnagar | Nizamabad | Nallagonda | Mahaboobnagar | Warangal | Khammam | Amaravathi | Tirupathi | Kurnool | Eluru | Visakhapatnam | Ananthapuramu | Kadapa




## హర్యానా సీఎంగా నాయబ్ సైనీ

### ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ బండారు దత్తాత్రేయ

### ప్రమాణ స్వీకారోత్స కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోడీ, అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా

**చండీఘర్, అక్టోబర్ 17 :** హర్యానా ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ ప్రమాణం స్వీకారం చేశారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ నాయబ్ సింగ్ సైనీ చేత సీఎంగా ప్రమాణం స్వీకారం చేయించారు. చండీగఢ్ సమీపంలోని పంచకుల పరేడ్ గ్రౌండ్‌లో గురువారం జరిగిన ప్రమాణ స్వీకారోత్స కార్యక్రమానికి ప్రధాని మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితర నేతలు హాజరయ్యారు. వీరితో పాటు ఎన్డీఏ కూటమి పాలిత రాష్ట్రాలకు చెందిన 18 మంది ముఖ్యమంత్రులు అటెండ్ అయ్యారు. కాగా, ఇటీవల జరిగిన హర్యానా అసెంబ్లీ మిగతా 2లో...



## షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్

### నవంబర్ 18లోగా హాజరు పర్చాలని క్రైమ్ ట్రైబ్యునల్ కోర్టు ఆదేశం

**ఢాకా, అక్టోబర్ 17 :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు 45 మందిపై బంగ్లాదేశ్ ఇంటర్నేషన్ క్రైమ్ ట్రైబ్యునల్ గురువారం అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. అరెస్టు వారెంట్లు జారీ అయిన వారిలో అవామీ లీగ్‌కు చెందిన పలువురు నాయకులు సైతం ఉన్నారు. విద్యార్థుల ఉద్యమం నేపథ్యంలో జరిగిన మారణహోమం, ఇతర నేరారోపణలపై క్రైమ్ ట్రైబ్యునల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతూ ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన రెండు పిటిషన్లపై జస్టిస్ మహ్మద్ గోలం ముర్తాజా మజుందార్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని చీఫ్ ప్రాసిక్యూటర్ మహ్మద్ తాజుల్ ఇస్లాం వెల్లడించారు. నవంబర్ 18లోగా షేక్ హసీనా సహా మొత్తం 46 మందిని మిగతా 2లో...

## మూసీ సుందరీకరణ కాదు..

# పునరుజ్జీవం




**4 కోట్ల మంది తెలంగాణ ప్రజల కోసం: సీఎం**

- మూసీ మురికి నుంచి పేదలను కాపాడుతాం
- పేదలను తరిమి కొట్టేంత దుర్మార్గం చేయలేదు
- మావి పచ్చి నిజాలు.. దమ్ముంటే చర్చకు రండి
- అవసరమైతే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు
- వారి మనసులు గెలుస్తున్నాం.. ఆదుకుంటున్నాం
- 18 నెలల్లో డీపీఆర్.. ఇప్పటి వరకు రూ.141 కోట్ల ఒప్పందం
- రూ.లక్షా యాభై వేల కోట్లు ఎక్కడివో వారే చెప్పాలి
- మీడియా సమావేశంలో వివరణ ఇచ్చిన సీఎం రేవంత్

మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ బాధితులను హింసించింది మరిచారా

మూసీని చెరపట్టి చెడగొట్టింది మీరు కాదా

మూడు నెలలు కేటీఆర్, హరీష్, ఈటెల అక్కడ ఉంటారా

వారికి సకల సౌకర్యాలు కల్గించి ఉంచుతాం : సీఎం

నెత్తిమీద నాట్లు

అద్దాల మేడలు... అందాల భామలు

కసబ్ కంటే వీరు మరింత ప్రమాదకారులు

కేటీఆర్‌పై రేవంత్ ఫైర్

వివరాలు 2లో..



## హైడ్రా తరహాలో..

### హైదరాబాద్‌లో ఫుట్‌పాత్‌లపై షాపులు నేలమట్టం

### పబ్లిక్ నుంచి ఫిర్యాదులు మేరకే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాం : డిసిపి రాహుల్ హెగ్డే

### హైదరాబాద్ ట్రాఫిక్ సమస్య క్లియర్ చేయడానికి.. రంగంలోకి హైడ్రా : రంగనాథ్

**హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్):** హైదరబాద్‌లోని నాలాలు, చెరువులను కబ్జాచేసి కట్టిన అక్రమ నిర్మాలను హైడ్రా కూల్చివేస్తుంటే.. రోడ్లపై ఫుట్పాత్లను అక్రమించి కట్టిన షాప్‌లను, షెడ్లను ట్రాఫిక్ పోలీసులు కూల్చివేస్తున్నారు. మోండా మార్కెట్‌లో ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా సేద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్లపై ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్న షెడ్లను ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే ఆధ్వర్యంలో కూల్చివేశారు. మార్కెట్లో తిరిగే పాదాచారులకు.. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఫుట్‌పాత్‌లపై ఉన్న షాప్‌లను కూల్చివేశారు. పబ్లిక్ నుంచి ఫిర్యాదులు రావడంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని.. ఇకనుంచి ప్రతి రోజూ అధికారుల పర్యవేక్షణ మిగతా 2లో...

2 **23న కేబినెట్ భేటీ..**

## రేవంత్‌వి తేనె పూసిన మాటలు

### మరో ఉద్యమానికి సిద్ధం కావాల్సిందే

### మందకృష్ణ మాదిగ హెచ్చరిక



**హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్):** మరో ఉద్యమానికి మాదిగ, ఉపకులాలు సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలుచేసే విషయంలో రాష్ట్రం ముందుంటుందని సీఎం అన్నారని గుర్తుచేశారు. కానీ అమలు విషయంలో జాప్యం చేస్తున్నారని చెప్పారు. 'ఎస్సీ వర్గీకరణ అమలులో ఎందుకు జాప్యం చేస్తున్నారు? మాదిగలపై రేవంత్‌వి తేనె పూసిన మాటలు. నమ్మించడంలో ఘనుడు.. మోసం చేయడంలో అంతకన్నా పెద్ద ఘనుడే. వర్గీకరణ అంశంపై సీఎం తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఎస్సీ వర్గీకరణ విషయంలో పంజాబ్, తమిళనాడు తొలి వరసలో నిలిచాయి. ముందు మిగతా 2లో...

## పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు

### అధికారులను సీఎస్ శాంతి కుమారి ఆదేశం

**హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్):** ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను ఏవిధమైన పొరపాట్లు లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో గురువారం సీఎస్ సచివాలయం నుండి వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.



టీజీపీఎస్సీ కార్యాలయం నుంచి చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు, సచివాలయం నుంచి డీజీపీ జితేందర్, కమిషన్ కార్య దర్శి నవీన్ నికోలస్, మిగతా 2లో...

## జీవో నెంబర్ 29ని రద్దు చేయాలి

### మళ్లీ ప్రిలిమ్స్ నుంచి పరీక్షల ప్రక్రియ

### పాత జీవో ప్రకారమే ఎగ్జామ్ జరపాలని అభ్యర్థన

### పీసీసీ చీఫ్, కేటీఆర్‌లతో విడివిడిగా అభ్యర్థుల భేటీ



**హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్):** తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల వివాదం ముదురుతోంది. మెయిన్స్ వాయిదా వేయాలంటూ అభ్యర్థుల ఆందోళనతో నగరంలో వాతావరణం హీటెక్కింది. అటు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కీలక నేతలతో అభ్యర్థులతో భేటీ కావడంతో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది. గ్రూప్-1 అభ్యర్థులు అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ నేతలను కలవడం చర్చనీయాంశంగామారింది. గురువారం గాంధీ భవన్‌లో గ్రూప్-1 అభ్యర్థులతో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ భేటీ అయ్యారు. గ్రూప్-1 అభ్యర్థులడిమాండ్లను తెలుసుకున్నారు. జీవో 29ను మిగతా 2లో...



## కొత్త అప్పులు రూ.49వేల కోట్లు

### పాత అప్పులు, వడ్డీల కింద కట్టింది రూ.56 వేల కోట్లు: డిప్యూటీ సీఎం

**హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్):** తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూ.49 వేల కోట్లకుపైగా రుణాలు తీసుకున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అదే సమయంలో పాత అప్పులు, వాటి వడ్డీల కింద రూ.56 వేల కోట్లకు పైగా చెల్లించామని చెప్పారు. 'రూ.80 వేల కోట్లకు పైగా అప్పులు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఒక్క ప్రాజెక్టు అయినా కట్టిందా? డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి?' అని బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, వ్యయంపై భట్టి బుధ వారం ప్రకటన విడుదల చేశారు. 2023 డిసెంబర్ నుంచి ఈ నెల 15 వరకు తీసుకున్న అప్పుల వివరాలను అందులో వెల్లడించారు. 'ఈ నెల 15 వరకు ప్రభుత్వం తీసుకున్న రుణాల మొత్తం రూ.49,618 కోట్లు. ఇదే సమయంలో పాత అప్పులు, వడ్డీల కింద మిగతా 2లో...

## ప్రశ్నించడం బంద్ అయితే..

# తెలంగాణ మూగబోతది




- బీఆర్ఎస్ తెలంగాణ అస్తిత్వ పార్టీ
- తెలంగాణ కోసం కొట్లాడేది.. మన పార్టీయే
- ఇది కేసీఆర్, కేటీఆర్‌దో కాదు... తెలంగాణ ప్రజలది
- కాంగ్రెస్ పాలనలో దోపిడీ పెరిగింది
- బీజేపీ మత రాజకీయాలు చేస్తోంది
- బీఆర్ఎస్‌వి సమావేశంలో కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్):** రేవంత్ రెడ్డి ఉడుత ఊపులకు భయపడే ప్రసక్తే లేదు.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బంద్ అయితే.. సమాజం తరపున కొట్లాడడం బంద్ అయితే.. పేద ప్రజల తరపున మాట్లాడడం బంద్ అయితే తెలంగాణ మూగబోతది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎందుకంటే బీజేపోడు మాట్లాడడు. తెలంగాణన నాశనం చేసిన మిగతా 2లో...

## బతుకమ్మ చీరలపై పొంతనలేని మాటలు

### చీరులు లేకుండానే ముగిసిన బుతకమ్మ

### సీతక్క మాటలు అర్థం లేనివంటూ హరీష్ విమర్శలు

**హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రతి బతుకమ్మ పండుగకు రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చీరలను పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఆ బతుకమ్మ చీరలతో ఆడబిడ్డలు సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేవారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బతుకమ్మ చీరలు మాయమయ్యాయి. బతుకమ్మ చీరలపై ప్రజలు ప్రశ్నిస్తే.. మిగతా 2లో...



మనం






## హర్యానా సీఎంగా నాయబ్ సైనీ

మొదటి పేజీతరువాయి...



ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధించిన విషయం తెలిసిందే. 90 సీట్లలకుగానూ 48 స్థానాలను కైవసం చేసుకుని ముచ్చటగా మూడోసారి హర్యానా గడ్డపై కాషాయ జెండా రెపరెపలాడించింది. లాడ్వా అసెంబ్లీ సెగ్మెంట్ నుండి బరిలోకి దిగిన సైనీ.. సమీప కాంగ్రెస్ అభ్యర్థిని చిత్తు చేసి ఘన విజయం సాధించారు. ఈ క్రమంలోనే 2024, అక్టోబర్ 16న హర్యానా బీజేపీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ భేటీలో నాయబ్ సింగ్ సైనీని ఏకగ్రీవంగా బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. ఈ మేరకు నాయబ్ సింగ్ సైనీ గవర్నర్ బండారు దత్తా త్రేయ ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించి.. ముఖ్యమం త్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు.

## షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్

మొదటి పేజీతరువాయి...

అరెస్ట్ చేసి హాజరుపరచాలని ధర్మాసనం అధికారులను ఆదేశించింది. బంగ్లాదేశ్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమం హింసాత్మకంగా సాగిన విషయం తెలిసిందే. ఉద్యమాన్ని అణిచివేసేందుకు షేక్ హసీనా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విద్యార్థి నేతలు ఆరోపించారు. హింసాత్మక ఘటనలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. నిరసనలు మరింత ఉధృతం కావడంతో షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీ నామా చేసి భారత్కు వచ్చారు. ఆమె ప్రస్తుతం భారత్లోనే ఆశ్రయం పొందుతున్నారు. హసీనా రాజీనామా తర్వాత నోబెల్ గ్రహీత, ఆర్థిక వేత్త మొహమ్మద్ యూ నస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వం విద్యార్థి ఉద్యమంలో హింసకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నది.

## హైడ్రా తరహాలో..

మొదటి పేజీతరువాయి...

ఉంటుందని డిసిపి రాహుల్ హెగ్డే అన్నారు.

### హైదరాబాద్ ట్రాఫిక్ సమస్య క్లియర్ చేయడానికి.. : రంగనాథ్

విశ్వనగరంగా ఉన్న హైదరాబాద్లో ట్రాఫిక్ సమ స్యను పరిష్కరించడానికి ట్రాఫిక్ విభాగంతో కలిసి హై డ్రా పని చేయాలని నిర్ణయించుకుంది. ఈమేరకు హై డ్రా కమిషనర్ రంగనాథ్ నాంపల్లిలోని ట్రాఫిక్ అదన పు కమిషనర్ ఆఫీస్లో ట్రాఫిక్ కమిషనర్ విశ్వవర ప్రసాద్, ఇతర ట్రాఫిక్ పోలీసులతో కలిసి సమీక్ష నిర్వ హించారు. హైదరాబాద్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి రివ్యూ మీటింగ్లో చర్చించారు. డీఆర్ఎఫ్ బృందాలకు ట్రాఫిక్ నియంత్రణపై శిక్షణ ఇప్పించాలని హైడ్రా నిర్ణయం తీసుకుంది. వర్షం పడ్డప్పుడు వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీరు నిలవకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ప్రధాన రహదారులతో పాటు.. కాలనీల్లో ఫుట్పాత్ల ను ఆక్రమించి ఉన్న దుకాణాలను తొలగించనున్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఫుట్పాత్లను, రహదారుల ను ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేసిన వ్యాపారులకు సమాచారం ఇచ్చి వాటిని తొలగిస్తామని హైడ్రా కమిష నర్ రంగనాథ్ అన్నారు

## 23న కేబినెట్ భేటీ..

**హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్):** తెలంగాణ కేబినెట్ భేటీకి ముహూర్తం ఫిక్స్ అయ్యింది. 23న రాష్ట్ర సచివాలయంలో మంత్రి మండలి భేటీ కానుంది. 23వ తేదీ సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా చట్టబద్ధంగా మారడం.. హైడ్రా ఏర్పాటును హైకోర్టు సమర్థించడం వంటి అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. దీంతో పాటు మూసీ ప్రక్షాళన, రైతు భరో సా విధివిధానాలు, శీతాకాల అసెంబ్లీ సమావేశాల నిర్వహణ వంటి టాపిక్స్పై కేబినెట్ డిస్కస్ చేయనున్న ట్లు తెలుస్తోంది. కాగా, తెలంగాణలో అధికారంలోకి వస్తే రైతు భరోసా పేరుతో రైతన్నలకు పట్టుబడి సా యం కింద సంవత్సరానికి ఒక ఎకరాకు రూ.15 వేలు అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిం దే. ఈ మేరకు రైతు భరోసా గైడ్ లైన్స్ రూపొందిం చేందుకు ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. వివిధ వర్గాలతో చర్చలు జరిపిన కేబినెట్ సబ్ కమిటీ.. రైతు భరోసా గైడ్ లైన్స్ ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. దీనిపైనే కేబినెట్ భేటీలో చర్చించనున్నట్లు సమాచారం. త్వరలోనే రైతు భరోసా స్కీమ్ ఇంప్లీమెంట్ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రకటించిన విషయం తెలిసిందే.

## రేవంత్వి తేనె పూసిన మాటలు

మొదటి పేజీతరువాయి...

అమలుచేస్తామన్న రేవంత్ మాటలకు విలువ లేకుండాపోయింది అని మందకృష్ణ మాదిగ విమర్శించారు.

# మూసీ సుందరీకరణ కాదు.. పునరుజ్జీవం..



**హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్):** తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవనమని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తెలిపారు. దీనిని వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న పార్టీలపై ఆయన ఆగ్రమం వ్యక్తం చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా గురువారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 4 కోట్ల మంది తెలంగాణ ప్రజల భవిష్యత్ కోసమే మూసీ ప్రాజెక్ట్ పునర్జీవన కార్యక్రమం చేపట్టామని అన్నారు. మూసీనది అభివృద్ధి ప్రాజెక్టు వివరాలు వెల్లడించారు. 'మూసీ దుర్గంధంలో మగ్గిపోతున్న వారికి మెరుగైన జీవితం ఇవ్వాలని ఈ ప్రాజెక్టు తలపెట్టామని అన్నారు. నగరం మధ్య గుండా నది వెళ్తున్న రాజధాని మరొకటి ఈ దేశంలో లేదు. దాదాపు 300కి.మీ ప్రవహించే మూసీకి ఎంతో చరిత్ర, విశిష్టత ఉంది. మేం చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం. కొందరు మెదడులో మూసీలో ఉన్న మురి కికంటే ఎక్కువ విషంనింపుకొన్నారు. మెదడులో విషం నింపుకొని మూసీ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ పరివా హక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ఈ ప్రభుత్వ ఆలోచన. మల్లన్న సాగర్, వేమలఘాట్లో ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోవాలి. రాత్రికి రాత్రే పోలీసులతో కొట్టించి, గుర్రాలతో తొక్కించి మేం ఖాళీ చేయించటం లేదు. రంగనాయక్సాగర్, కొండపోచమ్మ.. ఇలా ఎక్కడికైనా నేను వస్తా. నేడు మూసీ నది కాలుష్యానికి ప్రతీకగా మారింది. 1600కు పైగా నివాసాలు పూర్తిగా మూసీ నది గర్భంలో ఉన్నాయి. మల్లన్నసాగర్లో మునిగిపోయిన 14 గ్రామాల్లో ఎలా వ్యవహరించారో తెలుసా? మేం ఉన్నపళంగా, నిర్దయగా ఎవరినీ ఖాళీ చేయించలేదు. నిర్వాసితులకు రెండు పడక గదుల ఇళ్లు కేటాయించి, రూ.25వేలు ఇచ్చాం. చెరువుల్లో అక్రమంగా నిర్మించుకున్న భవనాలనే హైడ్రా కూల్చింది. మూసీ పరివాహకంలో ఎవరి ఇళ్లను హైడ్రా కూల్చలేదు. చినుకు పడితే చాలు హైదరాబాద్లో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్లపై పడిన వర్షపు నీరు చెరువుల్లోకి, నదుల్లోకి చేరాలా.. అలాగే రోడ్లపై ఉండాలా?' అని సీఎం ప్రశ్నించారు. అసలు ప్రాజెక్టుకు ఎందుకు చేపట్టారో వివరించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నేతలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. మూసీ సుందరీకరణ అంశంపై వివాదం మరింత చెలరేగుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి మీడియా ముందుకు వచ్చారు. మూసీ వివాదంపై స్పష్టత ఇచ్చారు. తెలంగాణ భవిష్యత్ను నిర్దేశిరచే ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. 33 బృందాలు మూసీ పరివాహకంపై అధ్యయనం చేశాయని సీఎం తెలిపారు. మూసీ పరివాహకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని.. అలాంటి వారికి మెరుగైన జీవితం అందించాలని భావిస్తున్నామన్నారు. విద్యావంతుల నుంచి నిరక్షరాస్యుల వరకు అందరికీ హైదరాబాద్ ఉపాధి కల్పించాలన్నారు. గత ప్రధానులు పంచవర్ష ప్రణాళికలతో దేశాన్ని అభివృద్ధి చేశారని.. గత ప్రధానులు సంస్కరణలు తెచ్చిన ప్రతిసారీ కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చిందని సీఎం గుర్తు చేశారు. 10 నెలలుగా అధికారులు నిద్రాహారాలు మాని మూసీపై పనిచేస్తున్నారని సీఎం తెలిపారు. మూసీ నదిలో పేదలు ఎదుర్కొంటున్న కష్టాలను అధికారులు గుర్తించారన్నారు. విప్లవాత్మక నిర్ణయాలను వ్యతిరేకించే వాళ్లు ఎప్పుడూ ఉంటారని అన్నారు. విషవలయంలో పేదలు ఉండాలనేది కొందరి ఆలోచన అంటూ విపక్షాలపై పరోక్షంగా సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. భూగరిష్ట పరిమితి చట్టాన్ని వ్యతిరేకించిన వర్గం కూడా దేశంలో ఉండేదన్నారు. పేదలు ఎప్పుడూ పేదలుగానే ఉండాలని దొరలు, భూస్వాములు భావిస్తారన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు రాష్ట్రాన్ని దోచుకున్నారని సీఎం ఆరోపించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదని.. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం అని చెప్పారు. కొందరి మెదడులో మూసీలో ఉన్న మురికి కంటే.. ఎక్కువ విషం నింపుకున్నారంటూ విపక్ష నేతలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విషపూరిత ఆలోచనలతోనే మూసీ ప్రాజెక్ట్పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ప్రభుత్వ ఆలోచనగా సీఎం పేర్కొన్నారు. రచ్చ బండ నిర్వహిద్దాం.. కేసీఆర్.. నీ నియోజక వర్గానికే వస్తా. రచ్చ బండ దగ్గర కూర్చొని మాట్లాడదాం. మాకేం అభ్యంతరం లేదు. ప్రజలు ఇచ్చిన బాధ్యత కాబట్టి ప్రజలకు మేలు చేయాలన్న దే మా ఆలోచన. మూసి సుందరీకరణ కాదు. ప్రక్షాళన. దుబాయ్ వెళ్లి జుట్టు మొలిపించుకునేటట్టు కాదు. నది ప్రవహించే నగరం దేశం లోనే లేదు. అలాంటి నగరం హైదరాబాద్ మాత్రమే. దాన్ని పాలకుల నిర్లక్షం వల్ల మురికి కూపం అయ్యింది. మూసి పునరుజ్జీవం పోస్తాం. సమస్యలు తెలుసుకుని ఒక్కొక్కరిని తరలించాలని మా ఆలోచన అని సీఎం రేవంత్ అన్నారు. ఆరు నెల్ల నుంచి అధికారులు సర్వే చేస్తున్నారని.. వేములఘాట్.. మల్లన్న సాగర్ ముంపు గ్రామాలలో ఎవరికైనా ఇండ్లు.. ఇంటి తాళం ఇచ్చారా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మిడ్ మనేరును పిల్లను ఇచ్చిన పాపానికి ఊరినే ముంచారు. హైడ్రా ఏదైనా బూతమా.. ఫార్మ్ హౌస్లో ఉన్న దొరనా. వచ్చి కబలించుకు పోవడానికి.. బఫర్ జోన్లో 10 వేల ఇండ్లు ఉన్నాయి. వారిని ఎలా ఆదుకోవాలి.. బెటర్ లైఫ్ ఎలా ఇవ్వాలి అని ఎంఎల్ఏలతో మాట్లాడండి అని మంత్రులకు చెప్పాం. బుల్డోజర్లు మామీద నుంచి పోనియ్యాలి అని పోటీ పడుతున్నారు. నగరాన్ని సర్వ నాశనం చేయదలుచుకున్నారా? వర్షం వస్తె చెన్నై.. బెంగుళూరు ఏమైందో చూశారా..? దుబాయ్ ఏమైంది. వయనాడ్లో పరిస్థితి ఏమైందో తెలియదా? ఖమ్మం.. విజయవాడ మునిగి పోయింది. కండ్ల ముందు చూశాం. మూసి వల్ల మాకు ఆర్థిక ప్రయోజనం ఏమైనా ఉందా మాకు..? ఉప్పెన వచ్చిందంటే.. కొట్టుకు పోతాం. నాకు అనుకున్నవి అన్ని వచ్చాయి. నాకేమైనా వస్తుందా.. మీరంతా చెప్పండి.. వద్దు అంటే వదిలేద్దాం. టెండర్ క్యాన్సల్ చేసి పంపుతాం. నల్గొండ వాళ్ళ బాధలు పట్టవా. నల్గొండ వాళ్లంతా అడుగుతున్నారు. అడగడం అన్న.. మానేయండి. నల్గొండ ప్రజలు మౌనగా ఉంటే ఎలా. నన్ను బ్లేమ్ చేసేది ఓ దోపిడీ దొంగ. వాడు నన్ను తిడితే బాధ పడను. లక్ష 50 కోట్లు అంటున్నాడు. ఇదేమైనా కాళేశ్వర మా? అని ప్రతిపక్షాలను సీఎం ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలి. విపక్ష నేతల సందేహాలు ఏమిటో చెప్పాలి' అని సీఎం ప్రశ్నించారు. మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్, సిఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

మూసీపై రగడ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్పై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్రెడ్డి మాట్లాడుతూ మూసీ నది సుందరీకరణ అంటూ కొందరు చేస్తున్న వ్యాఖ్యలను తప్పుబట్టారు. వారిలా సుందీకరణ కోసం దుబాయ్ వెళ్లి నెత్తిమీద నాట్లు వేయించుకునే కార్యక్రమం కాదని అన్నారు. అద్దాల మేడలు అందాల భామల కోసం వారిలా చేసే పనులు ఇవి కావని పేర్కొన్నారు. దోపిడీ దొంగలు, కసబ్ కంటే వారు ప్రమాదకారులంటూ రేవంత్రెడ్డి తనదైన శైలిలో కేటీఆర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం విధానం.. నెహ్రూ నుంచి రాజీవ్ గాంధీ వరకు చూడండని చెప్పరు. కాంగ్రెస్ ఇరిగేషన్.. ఎడ్యూకేషన్ మీదనే ఫోకస్ చేసిందని తెలిపారు. కాంగ్రెస్ విజన్ తోనే దేశం ముందడుగు వేసిందని.. సాంకేతిక విప్లవం వచ్చినప్పుడు కంప్యూటర్ వద్దన్న వాళ్ళు ఉన్నారన్నారు. కానీ కంప్యూటర్తో ఉద్యోగాలు పెరిగాయని.. ఆదాయం పెరిగిందని వెల్లడించారు. రాజీవ్ గాంధీ నూతన శకం ప్రారంభించారని కొనియాడారు. యూట్యూబ్లతో అధికారం వస్తుందని అనుకుంటున్నారు.. మూసిలో ఉన్న మురికి కంటే ఎక్కువ.. వాళ్ల మెదడు అంత విషం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దుబాయ్ వెళ్లి.. సుందరీకరణ పేరుతో గుండు మీద జుట్టు పెంచుకొనే పాలసీ కాదని.. పోలీసులతో గుర్రాలతో తొక్కించినట్టు చేయమన్నారు.

### హరీష్, కేటీఆర్, ఈటెలకు సీఎం సవాల్

హరీష్.. కేటీఆర్.. ఈటెలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మూడు నెలలు.. పేదలు కాళీ చేసిన ఇండ్లలో ఉండాలని.. కిరాయి తానే కడతానన్నారు. మూడు నెలలు అక్కడే ఉండి రాజకీయం చేయాలన్నారు. దాన కిషోర్ .. వాళ్లకు భోజనం కూడా పంపిస్తారని చెప్పారు. మూడు నెలలు మీరు అక్కడే ఉండాలని పునరుద్ఘాటించారు. మూసి ప్రక్షాళన ఆపేస్తే.. టెండర్ అగ్రిమెంట్కు నష్టం జరిగితే తన సొంత ఆస్తి అమ్మి కడతానని ముఖ్యమంత్రి అన్నారు. మూసి పాపంలో.. మమ్మల్ని కూడా నేరగాళ్లను చేయాలని అనుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. మూసి పునరుజ్జీవం కోసం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్ని రోజులు చర్చిస్తారో చర్చించాలని ప్రతిపక్షాలకు సూచించారు. ఏం చేద్దామో చెప్పండని.. ఈటెల.. కిషన్ రెడ్డి.. చేవెళ్ల ఎంపీల సూచనలు అడిగారు. వారు కూడా అసెంబ్లీకి రావాలని ఆహ్వానించారు. శాసనసభలో ప్రొవిజన్ ఉందని.. న్యాయ సలహా తీసుకుని ఎంపీలను కూడా సభలోకి తీసుకువస్తామన్నారు.

సలహాలు ఇవ్వాలని.. మీ మీ అనుమానాలు తనకు పంపమని సీఎం కోరారు. శనివారంలోపు తనకు ప్రశ్నలు పంపాలని సూచించారు. ప్రతి ప్రశ్నకూ సమాధానమిస్తానని స్పష్టం చేశారు. సభలో చర్చ పెడతామని.. మూసి చేయాలా వద్దా? నల్గొండ కమ్యూనిస్టులు కూడా చెప్పాలన్నారు. రాజకీయ పార్టీలతో సంప్రదింపుల కోసం సబ్ కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## ప్రశ్నించడం బంద్ అయితే.. తెలంగాణ మూగబోతది

మొదటి పేజీతరువాయి...

బీజేపోడు మెసలడు. బడే భాయ్ చోటే భాయ్ ఒక్కటే. పైననేమో జూమ్లా పీఎం.. ఇక్కడ్నేమో హౌలా సీఎం.. ఈయనకు ఏం తెల్వది.. ఆగమాగం అవుతున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దోచుకోవడంలో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఓ బిల్డర్ తనకు వద్దకు వచ్చి.. హైదరాబాద్లో కరెంట్ కనెక్షన్ కోసం 25 లక్షలు సమర్పించుకున్నట్లు చెప్పాడు. కాంగ్రెస్ నేతలు అందినకాడికి దోచుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. గత పది నెలల్లో అత్యంత కష్టకాలాన్ని ఎదుర్కొన్నాం. ఎవరూ ఊహించని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ప్రతిపక్షంలో కూర్చుంటామని ఊహించలేదు. డిసెంబర్ 7న కేసీఆర్కు ప్రమాదం జరగడం.. మూడు నెలల పాటు ఇబ్బందికి గురయ్యారు. ఓ పది మంది ఎమ్మెల్యేలు ప్రలోభాలతో దొంగల్లో కలిసిపోయారు. మన ఆడబిడ్డ కవితమ్మను ఐదున్నర నెలలు జైల్లో పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో కొట్లాడినం, పోరాడినం కానీ ఎవరికీ లొంగలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించిన దానికి భిన్నంగా ఫలితాలు వచ్చాయి. ఇవాళ కేసీఆర్ను తలచుకుంటున్నారు. కేసీఆర్ సీఎంగా ఉంటే రైతుబంధు, బతుకమ్మ చీరలు వస్తుండే అని అనుకుంటున్నారు. కులమతాలకు అతీతంగా కేసీఆర్ను తలచుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్దో, కేటీఆర్దో కాదు.. ఇది తెలంగాణ ప్రజల గొంతుక అని కేటీఆర్ స్పష్టం చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష.. కేసీఆర్ నాయకత్వం, గులాబీ జెండానే తెలంగాణకు రక్షణ. ఈ పార్టీ మరో 75 ఏండ్ల పాటు ఒక డీఎంకే లాగా, శిరోమణి అకాలీదళ్ లాగా ఉంటది. ఈ పార్టీ మన తెలంగాణ ప్రజలది అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో మనం జాగ్రత్తగా ఉండాలి. కాంగ్రెస్నే శత్రువుగా చూడాల్సిన అవసరం లేదు. తెలంగాణ సమాజానికి మరింత డేంజరస్ పార్టీ బీజేపీనే. మతాలను అడ్డంపెట్టుకుని, మతపరమైన రాజకీయాలు చేస్తూ.. దేవుడిని అడ్డుపెంట్టుకుని పిల్లలను రెచ్చగొడుతున్నారు. తెలంగాణకు చేసిందేమీ లేదు బీజేపీ. ఐఐటీ, ఐఐఎం, మెడికల్, నర్సింగ్ కాలేజీ ఇవ్వలేదు. ఆఖరికి ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వలేదు. తెలంగాణకు ఏం ఇచ్చారని అడిగితే ఎవరు చెప్పరు.. కిషన్ రెడ్డి, బండి సంజయ్కు మాటలు రావు. కానీ పిల్లలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. 32 జిల్లాల్లో పార్టీ ఆఫీసులు ఉన్నాయి. ప్రతి జిల్లాలో బీఆర్ఎస్వీ సమావేశాలు జరగాలి. మండలం, నియోజకవర్గం స్థాయిలో కమిటీలు వేసుకుందాం. సమర్థవంతమైన విద్యార్థి నాయకులు ఉన్నారు. వారిని జిల్లాలకు పంపుదాం. మండల కమిటీ, కాలేజీ కమిటీలను భర్తీ చేసి కొత్త నాయకత్వాన్ని ఎంకరేజ్ చేసుకుందాం. ఎక్కడికక్కడ సోషల్ మీడియాలో క్రియాశీలక పాత్ర పోషించాలి. కేసులకు భయపడొద్దు.. లీగల్ సెల్ను బలోపేతం చేస్తున్నాం. విద్యార్థి నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం. బీఆర్ఎస్వీ లేని కాలేజీ ఉండొద్దు. విద్యార్థి నాయకులకు రాజకీయంగా అవకాశాలు ఇస్తాం. మున్సిపల్ చైర్మన్లు, జడ్పీ చైర్మన్లు ఇతర పదవుల్లో అవకాశాలు కల్పిస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

## జీవో నెంబర్ 29ని రద్దు చేయాలి

మొదటి పేజీతరువాయి...

రద్దు చేసి పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు కోరారు. పాత జీవో 55 ప్రకారం పరీక్షల నిర్వహణ జరగాలన్నారు. పాత నోటిఫికేషన్లో ఇచ్చిన 503 పోస్టలలో కొత్త అభ్యర్థులకు అవకాశం ఇవ్వవద్దన్నారు.పెంచిన 60 పోస్టల్లో మాత్రమే కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా 503 పోస్ట్ ల్లో60 పోస్టులు పెంచి నోటిఫికేషన్ ఇచ్చింది). జీవో 29, రిజర్వేషన్ల అంశాల్లో కోర్టు కేసులు పెండింగ్లో ఉన్నాయని, వాటిని పరిష్కరించి పరీక్షలు పెట్టాలనిమహేష్ ను కోరారు. పాత నోటిఫికేషన్ ప్రకారమే రిజర్వేషన్లు, ఓపెన్ క్యాటగిరి ప్రకారం పరీక్షలు ఉండాలన్నారు. గ్రూప్-1 అభ్యర్థుల అభ్యర్థన మేరకు ప్రభుత్వానికి సమాచారం అందిస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. సాయంత్రం వరకు దీనిపై తగిన సమాచారం ఇస్తామని క్లారిటీ ఇచ్చారు. మరోవైపు కేటీఆర్పై పీసీసీ చీఫ్ ఫైర్ అయ్యారు. మీరు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేస్తారా..? అంటూ కేటీఆర్ కు పీసీసీ చీఫ్ సవాల్ విసిరారు. నిరుద్యోగుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని కేటీఆర్ ను విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో నే.. డీఎస్సీ.. వైద్యారోగ్యశాఖ లో ఉద్యోగాలు. గ్రూప్.. పోలీసు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మీరు ఏడున్నర లక్షల కోట్ల అప్పు చేసి మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చేశారని మండిపడ్డారు. ఇకపోతే తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్తో గ్రూప్-1 అభ్యర్థులు సమావేశమయ్యారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేసేలా సర్కార్పై ఒత్తిడి తేవాలని కేటీఆర్కు అభ్యర్థులు విన్నవించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల సమస్యలను కేటీఆర్ విన్నారు. అయితే గ్రూప్-1 మెయిన్స్ను రీ షెడ్యూల్ చేయాలని గత కొద్ది రోజుల నుంచి అభ్యర్థులు డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. కానీ కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదు. ఈ నెల 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. ఇదిలా ఉంటే ఈనెల 21 నుంచి జరిగే గ్రూప్-1 మెయిన్ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ గత రాత్రి వందలాది మంది అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పలువు అభ్యర్థులు మాట్లాడుతూ జీవో 29, జీవో 55పై ఎటూ తేల్చకుండా, తప్పుడు ప్రశ్నల అంశాన్ని పరిష్కరించకుండా ఆగమేఘాల మీద గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు గ్రూప్-1 పరీక్ష ప్రిలిమ్స్లో అన్ని ప్రశ్నలూ తప్పులతడకలేని, 150 ప్రశ్నలకు 20 ప్రశ్నలు తప్పుగా వచ్చాయని గుర్తుచేశారు. ఈ కేసులన్నీ పరిష్కరించిన తర్వాతే మెయిన్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని కేటీఆర్ కు కూడా అభ్యర్థులు వివరించారు. దీనిపై కేటీఆర్ సానుకూలంగా స్పందిస్తూ, దీనిపై న్యాయ సలహా తీసుకుంటామని హామీ ఇచ్చారు.. అభ్యర్దులకు అన్నివిధాల అండగా ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. కాగా, గ్రూప్-1 మెయిన్స్ రీషెడ్యూల్ చేయాలని అభ్యర్థులు గత కొద్ది రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం సాయంత్రం వందలాది మంది అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షపై దాదాపు 33 కేసులు వచ్చాయని.. వాటన్నింటినీ పరిష్కరించిన తర్వాతే మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులంతా ఒక్కసారిగా దూసుకురావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సమాచారం అందుకున్న పోలీసులు అభ్యర్థులను అరెస్ట్ చేసి వివిధ స్టేషన్లకు తరలించారు.

## కొత్త అప్పులు రూ.49వేల కోట్లు

మొదటి పేజీతరువాయి...

రూ.56,440 కోట్లు చెల్లించినం. ప్రభుత్వం చేసిన మూలధన వ్యయం రూ.21,881 కోట్లు. రుణమాఫీ, రైతు భరోసా, చేయూత, ఫ్రీ కరెంట్, గ్యాస్ సబ్సిడీ, ఫ్రీ బస్, స్కాలర్ షిప్స్, కల్యాణలక్ష్మి పథకాల కోసం రూ.54,346 కోట్లు ఖర్చు చేసినం' అని వివరించారు. ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని పేర్కొన్నారు.

## బతుకమ్మ చీరలపై పొంతనలేని మాటలు

మొదటి పేజీతరువాయి...

మంత్రులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. కేసీఆర్ ఏటా ఇచ్చే బతుకమ్మ చీరలను కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి ఎందుకు బంద్ చేసిందన్న దానికి సమాధానం చెప్పకుండా మంత్రి సీతక్క పొంతన లేని వ్యాఖ్యలు చేయడం శోచనీయం అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్రావు పేర్కొన్నారు. మా ప్రభుత్వం ఏటా రూ.300కోట్లతో బతుకమ్మ చీరెలు పంపిణీ చేసిందని ఒప్పుకున్నందుకు ముందుగా మీకు ధన్యవాదాలు అని సీతక్కను ఉద్దేశించి హరీశ్రావు వ్యాఖ్యానించారు. అయితే అంతకు మించిన ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించినట్లు భ్రమలు కలిపించే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం అని హరీశ్రావు పేర్కొన్నారు. మహిళలకు ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలు అమలు చేయకుండా, ప్రచారం కోరుకోవడం ముఖ్యమంత్రితో పాటు మంత్రులకు అలవాటుగా మారింది. మహాలక్ష్మి పథకానికి ఈ రాష్ట్రంలోని రేషన్ కార్డు కలిగి ఉన్న 93లక్షల కుటుంబాలలో 18 ఏళ్లు నిండిన ఒక్క మహిళను అర్హులుగా తీసుకున్నా.. 10 నెలలుగా నెలకు రూ.2,500 చొప్పున 93లక్షల మహిళలకు ఒక్కొక్కరికీ రూ. 25,000 వేలు బాకీ పడ్డారు. అంటే మొత్తం రూ.23,250 కోట్లు. మహాలక్ష్మి అమలు చేయకుండా మోసం చేయడమే కాకుండా రూ. 3,325 కోట్ల లెక్క చెప్పి, చెల్లించాల్సిన రూ.23,250 కోట్లు కప్పి పుచ్చారని హరీశ్రావు ధ్వజమెత్తారు. ఇది కాకుండా కళ్యాణ లక్ష్మి చెక్కులకు అదనంగా తులం బంగారం ఇస్తామని మాట తప్పారు. రూ.500 గ్యాస్ పథకం, 200 యూనిట్ల గృహజ్యోతిని కొందరికే పరిమితం చేశారు. హామీల అమలు విషయంలో చేసింది గోరంత, చెప్పుకునేది కొండంత అని విమర్శించారు. ఇక మహిళల గౌరవాన్ని నిలబెడుతున్నట్లు చెప్పిన మీ మాటలు అటుంచితే, ముందు మహిళల ప్రాణాలు కాపాడాలని, శాంతి భద్రతలు నిర్వహించి వారి భద్రతకు భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామని హరీశ్రావు పేర్కొన్నారు.

## పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు

మొదటి పేజీతరువాయి...

ఎస్పీడీసీఎల్ ఎండీ ముష్రాఫ్ అలీ, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు అనుదీప్, శశాంక్, గౌతమ్ తదితర అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు సీఎస్ శాంతి కుమారి. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతుండడంతో.. పరీక్షల నిర్వహణలో అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆధునిక సాంకేతికత, సోషల్ మీడియా యాక్టివ్గా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ కూడా సవాలుతో కూడుకుంటున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏవిధమైన అపోహలు, పుకార్లకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని మహేందర్ రెడ్డి సూచించారు.

# అక్రమ గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం

- 40 కేజీల గంజాయి 50 గ్రాముల హష్ ఆయిల్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్



**సంగారెడ్డి, అక్టోబర్ 17(మనం న్యూస్‌ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లాలోని మన్నూరు మండలం ఎక్స్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా 40 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ రూపేష్ కుమార్ తెలిపారు. గురువారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నమ్మదగిన సమాచారంతో మన్నూర్ ఎస్సై వారి సిబ్బంది తో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా దావూరి ఎక్స్ రోడ్ వద్ద నాగలిగిద్ద నుండి నారాయణఖేడ్ వైపు వస్తున్న ఒక షిఫ్ట్ డిజైర్ కార్ కే ఏ 29 ఎన్11640 నెంబర్ గల వాహనం తనిఖీ చేయగా ఆ కారు డిక్కీలో 40 కిలోల ఎండు గంజాయి గుర్తించడం జరిగిందని వెంటనే కారు డ్రైవర్ అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడు కర్ణాటక రాష్ట్రానికి చెందిన మల్లంకొండ గతంలో బీదర్ జైల్లో ఉండగా మల్కన్గిరి ఒరిస్సా రాష్ట్రానికి చెందిన రాహుల్ చక్రవర్తి అనుమానితుడు పరిచయమై అతను గంజాయి కేసులో బీదర్ జైల్లో ఉన్నానని నువ్వు కూడా గంజాయి జరపరా చేస్తే ఎక్కువ డబ్బులు సంపాదించచ్చని అని చెప్పి బాల్కి చెందిన మల్లేష్ గతంలో కూడా గంజాయి సరఫరా చేసి జైలుకు వెళ్లాడని అతను కూడా ఇదే జైల్లో ఉండేవాడని కొన్ని రోజుల క్రితం మే జైలు నుండి విడుదల అయ్యాడని అతనిని నువ్వు కలువమని చెప్పగా అత్యాశతో జైలు నుండి విడుదలైన మల్లేష్ నువ్వు కలిసి ఒరిస్సా చత్తీస్గడ్ ల నుండి గంజాయిని తీసుకువచ్చి అమ్మి అధిక డబ్బులు సంపాదిస్తున్నామని గత సెప్టెంబర్ నెలలో చిరాకుపల్లి పోలీసులు స్వాధీనం పరుచుకున్న 140 కేజీల ఎండు గంజి ప్యాకెట్స్ తమవేనని అప్పుడు పోలీసులకు దొరకకుండా తప్పించుకొని వెళ్లిన డిజైర్ కారు నాదేనని తన కారులో ఉన్న 40 కేజీల ఎండు గంజాయి తరలిస్తుండగా మనూరు పోలీసులకు దొరికాడని తెలిపారు మిగతా పరారీలో ఉన్న నిందితులు మల్లేష్ జూదేవ్ దాదాపాటి రాహుల్ చక్రవర్తి లను త్వరలోనే పట్టుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు.

### అమీన్పూర్‌లో హష్ ఆయిల్ స్వాధీనం...

రామచంద్రపురం మండలం బీరంగూడ వెంకటేశ్వర స్వామి గుడి వద్ద ముగ్గురు అనుమానిత వ్యక్తుల వద్ద నిషేధిత హష్ ఆయిల్ వినియోగిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేయడం జరిగిందని వారి వద్ద నుండి 50 గ్రాముల హష్ ఆయిల్ స్వాధీనం పరుచుకున్నామని మరో నాలుగు నిందితులు పరారీలో ఉన్నారని వారిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.జిల్లాలో మాదకద్రవ్యాల దుర్వినియోగంపై జిల్లా పోలీస్ శాఖ ఉప్పు పాదం మోపడం జరుగుతుందని ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలు సాగు సరఫరా చేసిన సంగారెడ్డి జిల్లా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సెల్ నెంబర్ 871 265677 7 నంబర్ కు సమాచారం ఇవ్వాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు ఈ కేసు చేదనులు కీలకంగా వ్యవహరించిన అధికారులకు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి వారికి రివార్డులను అందించారు ఈ కార్యక్రమంలో నార్కెట్ ఇన్ స్పెక్టర్ రమేష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్ స్పెక్టర్ విజయ్ కృష్ణ, అమీన్‌పూర్ ఇన్ స్పెక్టర్ నాగరాజు, నారాయణఖేడ్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సిసిఎస్ ఎస్ఐ శ్రీకాంత్ మన్నూర్ ఎస్సై రాజశేఖర్ సిసిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రజితకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే



**తిరుమలగిరి, అక్టోబర్17 (మనం న్యూస్):** మండలం తొండ గ్రామానికి చెందిన నెమరుగొమ్ముల శ్రీధర్‌రావు సతీమణి నెమరుగొమ్ముల రజిత ఇటీవల మృతి చెందారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ గురువారం తొండ గ్రామానికి వెళ్లి రజిత కుంటబ సభ్యులను పరామర్శించి రజిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు ఎస్.రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్‌కుమార్, గొలుసుల మల్లయ్య, నరోత్తంరెడ్డి, దయాయాదవ్, బర్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## క్షయ(టీబీ) వ్యాధి నిర్ధారణ పరీక్షలు



**పెన్‌పహాడ్, అక్టోబర్17(మనం న్యూస్):** మండల పరిధిలోని మహ్మదాపురం గ్రామంలో గురువారం క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షల (యాక్టివ్ కేస్ ఫైండింగ్) క్యాంపు ఆరోగ్య హెచ్ ఈఓ భూతంరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహజంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి అనేది దీర్ఘకాలిక వ్యాదుల లో ప్రధానమైనదని దీని పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈవ్యాధి సోకినవారు తుమ్మినా, దగ్గినా, ఉమ్మినా అది గాలి ద్వారా వేరే వారికి వ్యాప్తిం చెందుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. క్యాంపులో 10మంది టిబి వ్యాధి అనుమానిత లక్షణాలున్న వారి నుండి నమూనాలు సేకరించడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లావణ్య, ఎల్.టి రాజు, హెచ్ఎస్ జానకమ్మ, ఏఎంఎం నాగలక్ష్మి, ఎస్‌టిఎస్ ప్రిన్సిపల్, ఆశా కార్యకర్తలు, ఇందిర, నాగలక్ష్మి, విజయ, రేణుక, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కొండపాక, అక్టోబర్ 17, మనం న్యూస్:** అతివేగంగా కారు నడుపుతూ రోడ్డు ప్రమాదానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన కుకునూరుపల్లి శివారులో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన కార్వా రాజేష్ తన సొంత కారులో హైదరాబాద్ వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. రాజేష్ అతివేగంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఇనుప రాడ్డుకు తగిలి ముందు ఉన్న కారును ఢీకొట్టగా రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాజేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి



- మౌళిక వసతులు లోపిస్తే చర్యలు తప్పవు
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**తొగుట, అక్టోబర్ 17, మనం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు సహకరించి అభివృద్ధి చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కాన్గల్ ప్రాథమికొన్నత పాఠశాలలో మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి సహకారంతో విద్యార్థులకు క్రీడా దుస్తులు, మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన వైకుంఠ రథం, ఫ్రీజర్ ను, పెద్ద మాసాన్ పల్లి పాఠశాలలో బిఆర్ఎస్ యువ నాయకుడు పన్యాల ప్రవీణ్ రెడ్డి సహకారంతో విద్యార్థులకు క్రీడా దుస్తులను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రైవేటు మోజుతో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని విచారం వ్యక్తం చేశారు. కాన్గల్ పాఠశాలల్లో పారిశుధ్యం లోపించడం పట్ల ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యలు పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, తనవంతుగా సహకారం అందిస్తామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరు ఆయిన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, సొసైటీ చైర్మన్ కే. హరికృష్ణా రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, నాయకులు వేల్పుల స్వామి, కంది రాంరెడ్డి, సుతారి రమేష్, కొమ్ము శరత్, చంద్రా రెడ్డి, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, మంగ నర్సింలు, యాదగిరి, అల్వాల రాజి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బోయిని శ్రీనివాస్, మాదాసు అరుణ్ కుమార్, లక్ష్మారెడ్డి, తగరం అశోక్, పులి రాజు, గంగనిగల్ల బాలరాజు, రమేష్, అనిల్, శ్రీధర్, గురువారెడ్డి, భైరాగౌడ్, రాములు, పిట్ల వెంకటయ్య, రాంబాబు, కుమార్, కర్ణాకర్, నర్సింలు, నరేందర్ గౌడ్, సుభాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం పై ఎమ్మెల్యే ఆగ్రహం....

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం పై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడికందులలో విద్యుత్ ప్రమాదంలో మరణించిన యువ రైతు గోరేటి గురువారెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ఉండటంతోనే స్పింకర్ల పైపుకు విద్యుత్ వైర్లు తాకడంతో మరణించాడన్నారు. గురువారెడ్డి మరణించిన తర్వాత స్తంబాలు వేశారని, ముందు జాగ్రత్త పడితే ప్రాణాలు దక్కేవన్నారు. గురువారెడ్డి కుటుంబానికి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని విద్యుత్ ఎస్ఈ చంద్రమోహన్ కు ఫోన్ లో మాట్లాడి ఆదేశించారు. కాన్గల్ లో ఇటీవల మరణించిన ముడికె యాదయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**జాజిరెడ్డిగూడెం, అక్టోబర్17(మనం న్యూస్):** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. సన్నాలకు రూ. 500 బోనసును రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరను కల్పిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకరావాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, బీరవోలు సోమిరెడ్డి, సామా అభిషేక్‌రెడ్డి, ఇందుర్తి వెంకట్‌రెడ్డి, కుంట్ల సురేందర్‌రెడ్డి, అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, శిగ నసీర్‌గౌడ్, డీఆర్‌డీఏ సురేష్, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పవన్ కుమార్, డీపీఎం ఆంజనేయులు, ఏవో గణేష్, ఏపీఎం మల్లేష్, వాసుదేవరెడ్డి, సురేష్, అవిలయ్య, వీరస్వామి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



# మహనీయుల జీవిత చరిత్రలు భవిష్యత్ తరాలకు అవసరం



- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

**సిద్దిపేట, అక్టోబర్ 17 (మనం న్యూస్ ప్రతినిధి):** ఇతిహాసాల్లో మొదటిది రామాయణమని, అలాంటి రామాయణాన్ని రచించింది వాల్మీకి మహర్షి అని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలకు ముఖ్య అతిధిగా అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మన ఇతిహాసాల్లోని సారాంశాలను అందించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. గొప్పవారి చరిత్రలు తెలుసుకోవడం నేటి తరానికి చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి షేక్ మహ్మద్, వాల్మీకి బోయ రాష్ట్ర అధ్యక్షులు రాములు, కలెక్టరేట్ ఏఓ రహెమాన్ తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్యాలయంలో....

సిద్దిపేట పురపాలక సంఘ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా మున్సిపల్ కమీషనర్ ఆశ్రిత్ కుమార్ వాల్మీకీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి సాహిత్యంలో మొదటి కవిగా గౌరవించబడిన గొప్ప రుషి వాల్మీకి అని అన్నారు.

# వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

- మూల మలుపుల వద్ద వేగ నియంత్రణ చర్యలు
- ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 17, మనం న్యూస్:** వాహనదారులు ట్రాఫిక్ నియమాలకు అనుగుణంగా వాహనాలు నడపాలే తప్ప పోటీపడి వాహనాలు నడపవద్దని సిద్దిపేట ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్ అన్నారు. గురువారం రాజీవ్ రహదారి దుద్దెడ టోల్ గేట్ నుండి బెజ్జంకి పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవక్కపల్లి వరకు ఉన్న ప్రమాదాలు జరిగే ప్రదేశాలను ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సుమన్‌కుమార్ మాట్లాడుతూ వాహనదారులు అతివేగం, మద్యం సేవించి నడపడం ద్వారా ప్రమాదాలు జరిగి ప్రాణాలు కొల్పోతున్నారన్నారు. రాజీవ్ రహదారిపై మూలమలుపుల వద్ద ఉన్న చెట్ల కొమ్మలు ఏపుగా పెరగడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనబడడం లేదని, వెంటనే కొమ్మలను తీసివేయాలని సూచించారు. స్పీడ్ లేజర్ గన్ ద్వారా వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణ పై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ డీఈ వెంకటేష జేఈ ముజాఫరుద్దీన్, హె.కేఈఆర్ డీజీయం విజయ్‌భాస్కర్‌లు పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పెన్‌పహాడ్, అక్టోబర్ 17 (మనం న్యూస్):** మండల పరిధిలోని దూపహాడ్ సబ్‌స్టేషన్ నందు నేడు జరగనున్న పనుల్లో విద్యుత్తు అంతరాయానికి వినియోగదారులు, గ్రామాల ప్రజలు సహకరించాలని విద్యుత్ ఏఈ రమేష్ కోరారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పెరిగిన విద్యుత్ వాడకం వల్ల గతంలో ఉన్న 5యంవీఏయే పవర్ ట్రాన్సాఫార్మర్ స్థానంలో 8యంవీఏ పవర్ ట్రాన్స్‌ఫర్మార్స్ మార్చడం జరుగుతున్నందున ధూపహాడ్ సబ్‌స్టేషన్ పరిధిలో గల దూపహాడ్, లింగాల, న్యూ బంజారాహిల్స్ తండా, జల్మలకుంట తండా, చినగారకుంటతండా, చిన్న సీతారాంతాండా తదితర గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

## దాతల సహకారాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలి

- లయన్స్‌క్లబ్ పటాన్చెరు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



**హైదరాబాద్, అక్టోబర్ 17(మనంన్యూస్):** దాతల సహకారంను విద్యార్థులు అందిపుచ్చుకొని బాగా చదువుకోవాలని లయన్స్లబ్ పటాన్చెరు డిస్టిక్ ఛైర్మన్ బుక్కినేని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం లయన్స్లబ్ ఆఫ్ పటాన్చెరు ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం నల్తూర్ గ్రామంలో పటాన్చెరు మాజీ జడ్పీటీసీ మాదిరి లయన్ జైపాల్ సహకారంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్స్లబ్ పటాన్చెరు డిస్టిక్ ఛైర్మన్ బుక్కినేని వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ ఆఫ్ పటాన్చెరు మాజీ అధ్యక్షులు లయన్ పద్మమోహన్ రెడ్డి ,లయన్ అమరేందర్ రెడ్డిలు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద బడుగు బలహీన విద్యార్థుల శ్రేయస్సు కొరకు మేము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, టి శేషు కుమార్, మహమ్మద్ అబ్దుల్లా, దయాకర్, మహమ్మద్ రఫీ, హేమలత పాల్గొన్నారు.

## బీజేపీతోనే దేశ రక్షణ సాధ్యం

- సభ్యత్వ నమోదులో బీజేపీ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి



**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 17(మనం న్యూస్):** దేశ రక్షణ బీజేపి పార్టీతోనే సాధ్యమని బీజేపి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరే విధంగా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ హయాంలో, కాంగ్రెస్ హయాంలో ప్రజలు విసుగు చెందారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుండి 20 మంది కార్యకర్తలు బీజేపి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షులు అన్నసాగరం సురేష్ గౌడ్, కిసాన్ మోర్చ జిల్లా అద్యక్షులు తిరుమల్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి, రమేష్ గౌడ్, జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్ శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు నవీన్, త్రిలోచన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- టిఎన్‌జివో సంఘం జిల్లా అధ్యక్షులు పరమేశ్వర్




**సిద్దిపేట, అక్టోబర్ 17(మనం న్యూస్ ప్రతినిధి):** నూతన ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లడానికి ఉద్యోగస్తులందరూ కృషి చేస్తున్నారని టిఎన్.జి.ఓ. సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రం రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా సమస్యల పట్ల చొరవ తీసుకొని పరిష్కారమయ్యే విధంగా టిఎన్జిఓ సంఘం ఎప్పుడూ ముందుంటుందన్నారు. సంఘటితంగా కలిసి సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో సిద్దిపేట జిల్లా టిఎన్ జిఓ సహాధ్యక్షులు నిమ్మ సురేందర్ రెడ్డి, కోశాధికారి అశ్వక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



**సిద్దిపేట, అక్టోబర్ 17 (మనం న్యూస్ ప్రతినిధి):** మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని పోలీస్ కమీషనర్ డా. బి. అనురాధ అన్నారు. గురువారం వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కమీషనర్ కార్యాలయంలో వాల్మీకీ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒక సామాన్య వ్యక్తిగా పుట్టి రామాయణం గ్రంథాన్ని రచించి ఆదర్శప్రాయుడయ్యాడన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి మల్లారెడ్డి, ఏఓ యాదమ్మ, ఎస్.బి. ఇన్ స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి జీవితం ఆదర్శప్రాయం

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రాజన్న సిరిసిల్ల,అక్టోబర్17 (మనం న్యూస్):**రామాయణ గ్రంథం, గ్రంథ సృష్టికర్త మహర్షి వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శ ప్రాయం అనుసరణీయమని, ఆదికవి వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వాల్మీకి జయంతి ఉత్సవాలలో భాగంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జ్యోతి ప్రజ్వలన చేసి ఆది కవి వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయవాణిగా జీవితం గడిపిన వాల్మీకి నారద మహర్షి దివ్య ఉపదేశంతో ప్రపంచ ప్రసిద్ధి పొందిన రామాయణ మహా గ్రంధాన్ని 24 వేల శ్లోకాలతో ఆది కావ్యంగా పూర్తి చేసిన గొప్ప వ్యక్తి శ్రీ మహర్షి వాల్మీకి అని అన్నారు, కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు,మహా పురుషులవుతారు అనేదానికి వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. వాల్మీకి మహర్షిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ఆదర్శవంతులుగా జీవించి మంచి పేరు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, బిసి వెల్ఫేర్ అధికారి రాజమనోహర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలనాధికారి రాం రెడ్డి, సూపరిండెంట్లు కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో పాల్గొనాలి




**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 17( మనం న్యూస్ ):**పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలనికలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఫిలిం భవన్ లో జిల్లా విద్యాశాఖ– సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలలకు చెందిన 9 నుంచి 12 తరగతుల వరకు విద్యార్థులకు ఆరు అంశాల్లో(సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యాలు, చిత్రలేఖనం, స్టోరీ టెల్లింగ్) పోటీలు నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు గెలుపోటములతో సంబంధం లేకుండా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు.తెలంగాణ సంస్కృతి ఎంతో ఆకట్టుకుంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ప్రదర్శనలు ఆకట్టుకున్నా యి. ఈ కార్యక్రమంలో డీఈఓ జనార్ధన్ రావు తదితరులు పా ల్గొన్నారు.

## ఆరోగ్య మహిళపై అవగాహన కల్పించాలి



**కొత్తపల్లి, అక్టోబర్ 17( మనం న్యూస్ ):**ఆరోగ్య మహిళా కార్యక్రమం పై మహిళలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం రేకుర్తిలోని బస్తీ దవాఖానను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ల్యాబ్, మందుల గది, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీఎంహెచ్ఓ సుజాతను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బస్తీ దవాఖానాలో ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలు, రోగనిర్ధారణ పరీక్షల గురించి మహిళలకు వివరించాలన్నారు. కుక్క,పాము కాటు బాధితులు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ప్రజలకు వైద్యంపై అవగాహన కల్పించేలా బస్తీ దావఖానాలో టీవీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ దవాఖాన వైద్యాధికారి మౌల్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ సనా, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

## మహర్షి వాల్మీకి గొప్ప కవి,తత్వవేత్త

- కలెక్టర్ పమేలా సత్పతి
- ఘనంగా వాల్మీకి జయంతి



**కరీంనగర్ బ్యూరో,అక్టోబర్ 17 (మనం న్యూస్):**మహర్షి వాల్మీకి గొప్ప కవి అని, తత్వవేత్త గా పేరుగడించారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఘన ంగా నిర్వహించడం జరిగింది తొలుత జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి వాల్మీకి చిత్ర పటా నికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా కలె క్టర్ మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి జయంతి ఆశ్వీయుజ పౌర్ణమి రోజున నిర్వహిం చుకోవడం జరుగుతున్నదని తెలిపారు. మహర్షి వాల్మీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఒక కవి గా, తత్వవేత్తగా పేరుగడిం చారని, మహర్షి వాల్మీకిని ఆదికవిగా అభివ ర్ణిస్తారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రఫుల్ దేశా య్,ట్రైనీ ఐఏఎస్ అజయ్ కుమార్,డీఆర్డీఓ శ్రీ ధర్,అధికారులు,బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, అక్టోబర్ 17(మనం న్యూస్ ):**గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళలలకు పెద్ద పీత వేస్తున్నదని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు . మహిళలలకు ఆర్థిక స్వాలంబనకు సమాజం లో ముందుకు తీసుకెళ్ళడానికి , మహిళా శక్తి క్యాంటీన్ల పేరిట మహిళల జీవితాల్లో మార్పు తీసుకు రావడాని కోసం , మహిళలు వల్ల కాళ్ళ మీద వాళ్ళు నిలవడానికి మహిళా శక్తి సాధికారతకు తెలంగాణ రాష్ట్రం మహిళా శక్తి గ్రూపులకు శిక్షణ ఇస్తోంది. అందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి ఈవెంట్ మేనేజ్మెంట్ లో తెలంగాణ చాంబర్ షాప్ ఈవెంట్స్ ఇండస్ట్రీ పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ తెలంగాణ తరపున నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్, గచ్చిబౌలి, హైదరాబాదు వారు ఈ మహిళలలకు పది రోజులపాటు శిక్షణ ఇచ్చారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఈ శిక్షణలో పాల్గొని వచ్చిన ఈ ముగ్గురు మహిళలను ఒక ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ అభినందించారు . వారికి ప్రభుత్వం తరపున ఇచ్చిన సర్టిఫికెట్స్ ను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ శిక్షణలో మంచిర్యాల జిల్లా నుంచి ఈ కార్యక్రమానికి ఈవెంట్ మేనేజర్ గా గుడిపేటకు చెందిన చెన్న సత్యవతి, కాంటీన్ మేనజేమెంట్ లో లక్సేట్టి పేటకు చెందినా కోట జమున క్యాంటీన్ నిర్వహణ శిక్షణలో పాల్గొన్నారు అలాగే హాజీపూర్ కు చెందిన దేవరకొండ జ్యోతి కూడా ఈ శిక్షణలో లో పాల్గొని ప్రభుత్వం తరపున ఇచ్చే సర్టిఫికెట్లను పొందారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ( రెవెన్యూ) సభావత్ మోతిలాల్ ల్, జిల్లా సంబంధిత విభాగం అధికారులు తదితరులు కూడా పాల్గొని వీరిని అభినందించారు.

# మహిళలకు, విద్యార్థినులకు అండగా షీటీం

- పోకిరీలు, ఆకతాయిలపై షీ టీమ్స్ ఉక్కు పాదం
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్




**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 17 (మనం న్యూస్):** మహిళలను, విద్యార్థినీలను వేధిస్తున్న ఆకతాయిలపై ఒక్క ఫిర్యాదుతో భరతం పడుతున్నారు జిల్లా షీ టీమ్స్, పోలీసులు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ లో పరిధిలో విద్యార్థినుల పేరుతో ఇన్స్టాగ్రామ్ అకౌంట్ క్రియేట్ చేసి, వారి అకౌంట్ హ్యాక్ చేసి వేధింపులకు పాల్పడుతున్న ఐదుగురు పోకిరీలపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో ఫేక్ ఐడి లతో ఇన్స్టాగ్రామ్, ఫేస్ బుక్ అకౌంట్ లు క్రియేట్ చేసి,మహిళల సోషల్ మీడియా అకౌంట్స్ ని హ్యాక్ చేసి అసభ్యకర వీడియోలు, ఫోటోస్ పంపుతూ మహిళలు,విద్యార్థినుల వేధింపులు గురి అవుతున్న పిర్యాదులు ఎక్కువ వస్తున్నాయని, అలాంటి వేధింపులకు పాల్పడే పోకిరిల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, అలాగే సోషల్ మీడియా వేదికగా ఆడపిల్లలను, మహిళలను వేధించినా, అసభ్యంకర ఫొటోలు, వీడియోలు పంపిన, సోషల్ మీడియా అకౌంట్లలో పోస్టు చేసినా, మిత్రులకు షేర్ చేసినా తీవ్రమైన నేరంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇలాంటి స్వమస్యలపై జిల్లా పోలీస్ నిఘా ఉంటుందని ఆయన తెలిపారు.ఇలాంటి సమస్యలపై మహిళలు, విద్యార్థినులు నిర్భయంగా జిల్లా షీ టీమ్ కి పిర్యాదు చేయాలని కోరారు.సోషల్ మీడియా వేదికగా కానీ,పని చేసే ప్రదేశాల్లో కానీ, పాఠశాలలో, కళాశాలల్లో,మహిళలను ,విద్యార్థినులకు వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని , మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైనట్లయితే వెంటనే డయల్ 100, లేదా షీ టీం నెంబర్ 87126 56425 కి పిర్యాదు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయాలి



**జగిత్యాల టౌన్,అక్టోబర్ 17(మనం న్యూస్):**చదువు తో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసి సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించాల్సిన భాధ్యత ఉపాధ్యాయులదే అని వారి సమగ్ర అభివృద్ధి దిశగా పిల్లలని తీర్చి దిద్దాలని ఇన్చార్జి జిల్లా సెక్టరియల్ అధికారి కొక్కుల రాజేశ్ అన్నారు.ముగిసిన జిల్లా స్థాయి కళోత్సవ్ గురువారం స్థానిక టీచర్స్ భవన్ లో జగిత్యాల జిల్లా స్థాయి చివరి రోజు కళోత్సవ్ కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష జిల్లా విద్య శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమ ఇన్చార్జి జిల్లా సెక్టరియల్ అధికారి కొక్కుల రాజేశ్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు తో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసి సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించాల్సిన భాధ్యత ఉపాధ్యాయులదే అని వారి సమగ్ర అభివృద్ధి దిశగా పిల్లలని తీర్చి దిద్దాలని కోరారు. ఈసందర్భంగా మండల స్థాయి లో ఎంపికైన జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశా లలు, కే జి బి వి లు,మరియు మోడల్ స్కూల్ విద్యార్థులకు మిగిలిన థియేటర్ ఆర్ట్స్, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ ,మరియు దృశ్య కళల పై పోటీలను నిర్వహించారు. వొకల్ మ్యూజిక్ లో శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థిని వైష్ణవి, ఇన్స్టుమెంటల్ మ్యూజిక్ లో కే జి ఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తరుణి, డాన్స్ పోటీలలో జగిత్యాల కే జి బి వి విద్యార్థినిలు.థియేటర్ ఆరట్స్ పోటీలో జడ్ పి ఎచ్ పాఠశాల రామన్నపేట విద్యార్థిని అనుషా,ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ పోటీలో కొడిమ్యాల్ మోడల్ పాఠశాల విద్యార్థిని సంజన మరియు దృశ్య కళల పోటీలో జడ్ పి ఎచ్ పాఠశాల నమిలకొండ విద్యార్థిని అక్షయ మొదటి స్థానం పొందినారు. వీరు నవంబర్ లో జరిగే రాష్ట్రస్థాయి కళోత్సవ్ లో పాల్గొంటారని జిల్లా సెక్టరియల్ అధికారి కొక్కుల రాజేశ్ తెలిపారు .ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు గా ,కోరుట్లమహేష్,ఎలిగెటిరాజేంద్రప్రసాద్,అక్కినపెల్లి సతీష్, లక్ష్మన్ ,మరియు సంతోష్ చారి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలి



**జగిత్యాల టౌన్ ,అక్టోబర్17(మనం న్యూస్):** కరీంనగర్ ,మెదక్ ,నిజామాబాద్, అదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పి ఆర్ యు టి ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోయినపల్లి ఆనంద్ రావు అన్నారు ఈ సందర్భంగా గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో గరల్స్ హై స్కూల్ వీక్లీ బజార్ పురాణిపేట్ పేట్ ధరూర్ కాలనీ ధరూర్ కేజీబీవీ గాంధీనగర్ హై స్కూల్, పోర్ట్, కాజీపూర్ హై స్కూల్ పాఠశాలలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 2018 నవంబర్ నుండి 2024 నవంబర్ వరకు ఆరు సంవత్సరాల్లో కనీసం మూడు సంవత్సరాలు ఉన్నత పాఠశాలలో బోధించి ఉండాలని వారు తెలిపారు .నవంబర్ ఆరో తేదీ లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు.ప్రతి ఉపాధ్యాయుడు విలువైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని కరీంనగర్ మెదక్ అదిలాబాద్ నిజామాబాద్ ఉపాధ్యాయ పి ఆర్ టి యు టి ఎస్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 2024 డీఎస్సీ ద్వారా నియామకమైన నూతన ఉపాధ్యాయులను పి ఆర్ టి ఎస్ లో సభ్యత నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ శాఖ అధ్యక్షులు విద్యాదేవి ప్రధాన కార్యదర్శి పద్మ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జమున రాష్ట్ర ఉపాధ్యక్షులు చందన రజిత జిల్లా ఉపాధ్యక్షులు శ్రీదేవి షఫీ ప్రవీణ్ మీర్జా అబ్దుల్లా బేగ్ రాజేష్ బసిత్ తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్సీగా ఆశీర్వదిస్తే సేవకుడిలా పని చేస్తా




- 'నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తా.
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్ రెడ్డి

**సైదాపూర్ ,అక్టోబర్17 (మనంన్యూస్):**రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను ఎమెల్సీగా ఆశీర్వదించి గెలిపిస్తే సేవకుడిగా పని చేస్తూ అందరికి అందుబాటులో ఉంటానని వెల్లడించారు. గురువారం సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి, వెన్కేపల్లి, ఆదర్శ,పాఠశాల జూనియర్ కళాశాలలో ప్రచారం నిర్వహించి రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నాలుగు జిల్లాల వ్యాప్తంగా నిరుదోగులకు స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తానని అన్నారు..స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాల ద్వారా నిరుద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించి వారు సులువుగా ప్రయివేట్, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే విధంగా అందులో శిక్షణ ఇప్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ బకాయిలను విడుదలకు కృషి చేస్తానని అన్నారు.ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలను ప్రభుత్వంతో మాట్లాడి విడుదల చేయిస్తానని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాల ల్లో మౌలిక వసతుల కల్పన, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్, ప్రతి ఏడాది ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చేలా కృషి చేస్తానని అన్నారు... గతంలో ఎమ్మెల్సీ పదవిని రాజకీయాల కోసమే వాడుకున్నారని అన్నారు.

# మున్సిపల్ కమిషనర్‌పై క్రమశిక్షణ చర్యలు

**జగిత్యాల టౌన్,అక్టోబర్ 17(మనం న్యూస్):**జగిత్యాల మున్సిపల్ కమిషనర్ పై క్రమశిక్షణ చర్యలు సి.డి.ఎం.ఏ కు సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.జగిత్యాల మున్సిపల్ కమిషనర్ జిల్లా అధికారులకు మరియు ప్రజా ప్రతినిధులకు సహకరించడం లేదని సరెండర్ చేసినట్లు తెలుస్తుంది. గత కొద్ది రోజుల క్రితం జగిత్యాల జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆలస్యంగా ప్రజావాణికి హాజరవ్వడం ప్రశ్నించిన అక్కడి ఉన్నతాధికారుల తో తాను కూడా గ్రూప్ వన్ ఆఫీసర్ నేనంటే దురుసుగా సమాధానం ఇవ్వడం. అది కాస్త చిలికి చిలికి గాలి వానలా మారగానే దసరా రోజున చాలా రోజులగా సాంప్రదాయంగా వస్తున్న జమ్మి గద్ద వద్ద జమ్మి వృక్షాన్ని జగిత్యాల మున్సిపల్ ట్రాక్టర్ లొ తీసుకురావడం ఆనవాయితీగా వస్తున్న ఆచారాన్ని కాదని మున్సిపల్ కమిషనర్ ఆక్షేపించడం. జమ్మి వృక్షాన్ని మున్సిపల్ ట్రాక్టర్లు తీసుకురావడానికి అనుమతించకపోవడం తదితర కారణాల వలన అధికారులతోనూ ఇటు ప్రజాప్రతినిధులతో కమిషనర్ కు అభిప్రాయ భేదాలు ఉండడం వలన పాలనాపరమైన సమస్యలు తలెత్తడం వలన కలెక్టర్ అతన్ని సి.డి.ఎం.ఏ కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలుస్తుంది.

## ఖనిలో ఉచిత ఎన్‌రోల్ మెంట్ ప్రక్రియ...

**గోదావరిఖని,అక్టోబర్ 17(మనం న్యూస్):-** ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల కోసం ఎన్రోల్మెంట్ ప్రక్రియను విన్నర్స్ ఆన్లైన్,విన్నెర్స్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో గోదావరిఖని లో విన్నర్స్ టీం ఉచితంగా ప్రారంభించింది.హెల్ప్ లైన్ నెంబర్లు 90634 29414 , 9063300999 కు ఫోటో, డిగ్రీ ప్రొవిజనల్ లేదా మేమో, ఆధార్,ఓటర్ కార్డు వాట్సప్ ద్వారా పంపి ఉచిత రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని విన్నర్స్ సభ్యులు గున్నాల శ్రీధర్ గౌడ్, రాజేష్,మెండే లింగయ్య, సాయిని హరీష్ తెలియ జేశారు.

## ప్రైవేటు ఉద్యోగులకు సంరక్షణ చట్టం తేవాలి

- రిటైర్మెంట్ ఉద్యోగుల బెనిఫిట్స్ అందివ్వాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు



**జమ్మికుంట, (హుజురాబాద్ ), అక్టోబర్ 17( మనం న్యూస్ ):**ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వం సంరక్షక చట్టం తేవాలని కరీంనగర్ నిజామాబాద్ అదిలాబాద్ మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు అన్నారు. గురువారం హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఆయన ప్రచారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రస్తుత తరుణంలో రియంబర్స్మెంట్ ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ప్రైవేటు కళాశాలలు నిరవధిక బందును కొనసాగిస్తున్నాయని అన్నారు. రియంబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం ఒకేసారి కాకుండా విడతల వారీగా మంజూరు చేస్తే ప్రైవేటు కళాశాలల యజమాన్యాలు ఉపాధ్యాయులు బాగుపడతాయని అన్నారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఉన్నత చదువులు చదవడం కోసం రియంబర్స్మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని దానిని ప్రతి ప్రభుత్వం కొనసాగించాలని అన్నారు. రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు ప్రభుత్వం సరైన బెనిఫిట్స్ ఇవ్వడం లేదని దాంతో వారు తీవ్రమైనఆవేదనతో ఉన్నారని అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు 10 లక్షల హెల్త్ కార్డు, 10 లక్షల ఆరోగ్య భీమా సౌకర్యం కల్పిస్తే ప్రైవేటు ఉద్యోగులు సైతం ధీమా గా పని చేసుకుంటారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల సంరక్షణ చట్టం ఏర్పాటు చేసేలా తన గొంతు ఉంటుందని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే ఉద్యోగస్తుల సమస్యలతో పాటు ప్రైవేటు ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఇప్పటివరకు ప్రైవేటు ఉద్యోగుల సంక్షేమం కోసం గత పది సంవత్సరాలుగా కృషి చేసిన విషయం రాష్ట్రంలోని ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులకు విధితమేనని అన్నారు. కరోనా సమయంలో ప్రైవేటు ఉద్యోగస్తులకు 25 కిలోల బియ్యాన్ని, 2000 రూపాయల నగదును ప్రభుత్వం ద్వారా అందించిన విషయం ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు తో పాటు అధ్యాపకులు తులసీ దాస్ వాసుదేవరావు మురళి పున్నం చందర్ పాడి జైపాల్ రెడ్డి వెంకటరమణ డాక్టర్ వి స్వరూప రాణి, విజేందర్ రెడ్డి వనమాల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# మట్టిలోనే మాణిక్యాలు

- ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థులకు సన్మానించిన ఎమ్మెల్యే



**గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 17 (మనం న్యూస్):** ఇటీవల వెలు బడిన ఎంబిబిఎస్ ఫలితాలలో సీట్లు సాధించిన గద్వాల నియోజకవర్గం లోని గట్టు మండలం చెందిన ఆరు మంది విద్యార్థిని విద్యార్థులకు వివిధ జిల్లాల లోని మెడికల్ కళాశాలలో సీట్లు సాధించిన విద్యార్థులను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా సీట్లు సాధించిన విద్యార్థులు సిద్దిపేట మెడికల్ కళాశాలకు చెందిన జె. ఝాన్సీ రాణి, భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు చెందిన సాయిస్ఫూర్తి, హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలకు చెందిన ఎండీ సోహెల్, భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్కళాశాలకు చెందిన కుర్వా కుమార్ , గద్వాల గవర్నమెంట్ మెడికల్ కాలేజ్కు చెందిన సానియా బిజ్జి, కరీంనగర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్కు చెందిన ఎన్ .అక్షయలను గురువారం శాలువతో కప్పి పుష్పగుచ్చం, కానుకలను అందజేసిఅభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గం గట్టు మండలన్ని గతంలో అక్షరాస్యతలో వెనుకబడి ప్రాంతంగా పిలువబడే గట్టు మండలం, నేటి విద్యార్థుల అక్షరాలతో విద్యారంగంలో ముందడుగు వేయడం చాలా సంతోషంగా ఉందని. అదేవిధంగా విద్యార్థులు పట్టుదలతో శ్రమతో చదువు కొని విద్యా రంగంలో, ఇంజినీరింగ్ లో, వైద్యరంగంలో అయినా ఎంబిబిఎస్ లో సీటు సాధించడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఎంబిబిఎస్ లో సీటు సాధించిన విద్యార్థిని విద్యార్థులు భవిష్యత్తులో మంచిగా చదువుకొని మీ తల్లిదండ్రులకు, మీ ఉపాధ్యాయులకు, మీ గ్రామానికి, గద్వాల నియోజకవర్గానికి మంచి పేరు ప్రతిష్టలు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా వైద్యరంగంలో మెరుగైన శిక్షణ పొంది గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని గద్వాల నియోజకవర్గంలో గట్టు మండలంలో మరి కొంతమంది విద్యార్థులు వైద్యరంగంతో పాటు వివిధ రంగాలలో కూడా రాణించాలి ప్రతి ఒక్కరు మంచిగా చదువుకున్నప్పుడే మీరు నిర్ణయించుకున్న భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొని లక్ష్యం నెరవేరుతుందని ఆకాంక్షించారు. ఆల్ ది బెస్ట్ ఫర్ బ్రైట్ ఫీచర్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గడ్డం కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, కౌన్సిలర్ మురళి మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, నాయకులు ఆంజనేయులు, హనుమంతు రెడ్డి, గోపి, మధుసూదన్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశం



**చేవెళ్ల, అక్టోబర్ 17(మనం న్యూస్) :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం లోని చేవెళ్ల మండలం తంగేడుపల్లి గ్రామానికి చెంది న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకు లు గూడెం సత్యనారాయణ రెడ్డి నూ తన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి పామేనా బీమ్ భరత్ ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డ్ సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి. శ్రీకాంత్ రెడ్డి.రాఘవేందర్ రెడ్డి. శ్రీనివాస్ రెడ్డి. మల్లారెడ్డి. పరమేశ్వర్ రెడ్డి. సుధాకర్ రెడ్డి. ప్రశాంత్ రెడ్డి.ప్రభాకర్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల కూల్చివేతలపై ఎలాంటి భయాందోళనలు పడవద్దని



**రంగారెడ్డి,అక్టోబర్ 17 (మనం న్యూస్) :** చైతన్యపురి డివిజన్ పరిధిలోని మూసి పరివాహక ప్రాంత ప్రజలు ఇండ్ల కూల్చివేతలపై ఎలాంటి భయాందోళనలు పడవద్దని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నరసింహ గుప్తా అన్నారు. మూసి పరీవాహక ప్రాంతం లో పర్యటించి మరి ఒకసారి వారికీ భరోసా ఇవ్వడం జరిగిందన్నారు. మూసి ఇండ్ల కూల్చివేత విషయంలో బయాఆందోళన లకు లోనె హాస్పిటల్ పాలైన లక్ష్మమ్మ హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన సందర్భంగా పరామర్శించారు. అందరిని పలకరించి ధైర్యం చెప్పడం జరిగింది అని తెలిపారు.అక్కడి ప్రజలు స్టే తీసుకున్న విషయాన్ని పెద్దగా వ్రాయంచిన ఫ్లెక్సీ లును తమ ఇంటి కి కట్టుకున్నారు.

## ఆటోలో నుంచి ఎగిరిపడి యువకుడు మృతి

**చేవెళ్ల ,అక్టోబర్ 17(మనం న్యూస్) :** బీజాపూర్ రహదారిపై ఆటోలో నుంచి ఎగిరిపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం మర్కల్ గ్రామానికి చెందిన పుట్ట శంకర్ (21) నగరం లోని చేపల వ్యాపారి వద్ద పనిచేస్తున్నాడు. నగరం చుట్టూ జరిగే సంతలలో చేపలు అమ్మేందుకు నిత్యం ఆటోలో వెళ్లేవాడు. గురువారం చేవెళ్ల మార్కెట్లో చేపలు అమ్మేందుకు నగరం నుంచి ఆటోలు బయలుదేరారు. ఉదయము సుమారు 10:30 గంటల సమయములో కేసారం గేటు సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి ఒకవైపు ఒరగడంతో అందులో నుంచి శంకర్ , రాములు రోడ్డుపై పడిపోయారు.శంకర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.రాములు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

## మినీ అంగన్వాడి టీచర్లకు మెయిన్ అంగన్వాడి టీచర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

**చేవెళ్ల, అక్టోబర్ 17(మనం న్యూస్) :** అంగన్వాడి టీచర్లకు మెయిన్ అంగన్వాడి టీచర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సి డి పి ఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ కి వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు రాధా మాట్లాడుతూ... జనవరి నెలలో తెలంగాణ ప్రభుత్వం 4000 మంది మినీ అంగన్వాడి టీచర్లను మెయిన్ అంగన్వాడి టీచర్లుగా గుర్తిస్తూ జీవో నెంబర్ 4 విడుదల చేశారని జనవరి, ఫిబ్రవరి, మే, జూన్ నెలలలో మెయిన్ టీచర్లతో సమానంగా వేతనాలు చెల్లించారని తెలిపారు. మార్చి, ఏప్రిల్, జూలై,ఆగస్టు సెప్టెంబర్ నెలలో పాత పద్ధతిలోని వేతనాలు చెల్లించారని అన్నారు . ఈ విషయాన్ని ఐసిడిఎస్ అధికారుల దృష్టికి, ఐసిడిఎస్ మంత్రి సీతక్కకి యూనియన్ ఆధ్వర్యంలో అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చామని మినీ టీచర్ల సమస్యను ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. ఐసిడిఎస్ అధికారులను అడిగితే 4000 మంది మినీ టీచర్ల డేటా ఆర్థిక శాఖ ట్రెజరీ వద్ద అప్డేట్ కాలేదని చెప్పడం హాస్యాస్పదమని ప్రభుత్వ అధికారులు ఐసిడిఎస్ మంత్రి ప్రభుత్వమే మీ చేతుల్లో ఉందని దీనిని సాకుగా చూపి 4000 మంది మినీ టీచర్ల పొట్ట కొట్టడం సరికాదన్నారు. వెంటనే ఐసిడిఎస్ అధికారులు రాష్ట్ర మంత్రి సీతక్క గారు స్పందించి మినీ అంగన్వాడీ టీచరకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్లోని నాలుగు మండలాల మినీ టీచర్లు పాల్గొన్నారు.



## జిల్లా హమాలి సంఘం కౌన్సిల్ సమావేశంను విజయవంతం చేయండి





- ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు కె .రామస్వామి

**చేవెళ్ల,అక్టోబర్ 17 (మనం న్యూస్) :** జిల్లా హమాలి సంఘం సమావేశాన్ని విజయవంతం చేయాలని ఐటిసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె .రామస్వామి పేర్కొన్నారు. గురువారం చేవెళ్ల మార్కెట్ కమిటీ ఆవరణలో హమాలీలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జిల్లా అధ్యక్షుడు కె. రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన ఉదయం 11 గంటలకు రాజేంద్రనగర్ లోని ఏఆర్ దేవరాజ్ భవన్లో రంగారెడ్డి జిల్లా హమాలీ సంఘం నిర్మాణ కౌన్సిల్ సమావేశము ఉంటుందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి బాలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లా నిర్మాణ బాధ్యులు బి .చంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు హాజరు అవుతున్నారని తెలిపారు. ఈ సమావేశానికి హమాలి కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు . అదేవిధంగా చేవెళ్ల మార్కెట్ యార్డులో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు మంచినీటి సౌకర్యము, మరుగుదొడ్లు కనీస మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని హమాలీ కార్మికులకు తక్షణమే మౌలిక సదుపాయాలు ఈఎస్ఐ సదుపాయాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యుడు డప్పు శివయ్య, మండల అధ్యక్షుడు శివ, మండల పార్టీ కార్యదర్శి ఎం. సత్తిరెడ్డి , హమాలీ కార్మికులు మహేందర్, శివకుమార్ ,లక్ష్మయ్య ,నరసింహ, రామచంద్రయ్య, శ్రీనివాస్, శ్రీను, అనిల్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి దేవాలయాన్ని దర్శించుకున్న నల్లారెడ్డి

**గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 17 (మనం న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని గురువారం నూతన వాల్మీకి మహర్షి దేవాలయం విగ్రహం ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దొడ్డి నల్లారెడ్డి హాజరైనఈ సందర్భంగా మల్దకల్ లో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. వాల్మీకి సంఘం నాయకులు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్లారెడ్డికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భ ంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఓబిసి జిల్లా చైర్మన్ నల్లారెడ్డి మాట్లాడుతూ ముందుగా వాల్మీకి సోదరులకు జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదికవి వాల్మీకి మహర్షి రామాయణం రచించారు. మనం ఏదో సందర్భంలో రామాయణం గురించి ఆ సీతారాముల గురించి ప్రపంచానికి తెలియజేశారు. గ్రామాలలో వాల్మీకి విగ్రహం చేయడం గ్రామంలో ఒక పండుగ వాతావరణ నెలకుంటుంది. ప్రతి ఒక్కరూ భక్తి భావంతో దేవుని అనుగ్రహం ఉన్న ఉన్నప్పుడే మనం ఏ పని చేసినా ఆ పనిలో విజయం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి గ్రామ అధ్యక్షులు తోట నాగరాజు, సోదరులు పరుష, ఎలుక వెంకటన్న, నరసింహులు, ఎలుక గోవిందు, తిమ్మప్ప, మల్దకల్ గోవిందు, వెంకటన్న, మేకల నరసింహులు, చింతల నరసింహులు, నడిపి నరసింహులు, కావాలి తిమ్మప్ప, ఆంజనేయులు, హరి గిల్లి శ్రీను, కట్టెల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



## సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేసిన మాజీ కార్పోరేటర్



**రంగారెడ్డి, అక్టోబర్ 17 (మనం న్యూస్) :** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీ లో నూతనంగా నిర్మించిన సద్గురు సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజ లో పాల్గొన్న ఆర్కే పురం డివిజన్ మాజీ కార్పొరేటర్దేప సురేఖ భాస్కర్ రెడ్డి.ఈ సందర్భంగా సమర్థ సద్గురు సాయిబాబా మందిరానికి తమ స్వంత స్థలాన్ని విరాళంగా అందించిన బండపల్లి రీతా(అమల) సంతోష్ లని, బండపల్లి కుటుంబ సభ్యులను అభినందించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ స్వంత స్థలాన్ని మందిరానికి ఇవ్వడాన్ని అభినందించారు. గతంలో భూకబ్జాదారుల నుండి ఈ స్థలాన్ని కాపాడటంలో మాజీ కార్పొరేటర్ సురేఖ, స్థల యజమానులు, గ్రీన్ హిల్స్ కాలనీ అసోసియేషన్ వారు కృషి చేశారు. ఈ ప్రదేశంలో ఇంత మంచి మందిర నిర్మాణానికి దోహద పడ్డారన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, గట్ల రవీంద్ర (హైటెక్ రామ్), బండపల్లి కృష్ణ రావ్, దేవాలయ ఛైర్మెన్ దయాకర్ రెడ్డి, రవీందర్ సింగ్, ముప్పిడి లింగ స్వామి గౌడ్,రఘువీర్ రెడ్డి(రిటైర్డ్ న్యాయమూర్తి), సుదర్శన్ రెడ్డి, సురేష్, విజయ్, లక్ష్మీ, పద్మజ, రమేష్, నాగేశ్వర్ రావ్, సహస్ర, సుధ, సౌమ్య, మనీష్, వరుణ్తదితరులు పాల్గొన్నారు.

## దాడులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి

- బిజెపి చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్ రెడ్డి

**చేవెళ్ల,అక్టోబర్ 17(మనం న్యూస్) :** దేవాలయాలపై దాడులకు పాల్పడిన వారిపై ప్రభుత్వాలు కఠినంగా చర్యలు తీసుకొని శిక్షించాలని బిజెపి చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్ రెడ్డి డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ లోని ముత్యాలమ్మ గుడిలో విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని ఆయన ఖండించారు. గురువారం చేవెళ్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ముత్యాలమ్మ గుడిలో విధ్వంసం సృష్టించిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల కాలంలో హైదరాబాద్ మహానగరంలో దేవాలయాలు,హిందువులపై దాడులు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. హిందువులను టార్గెట్ చేస్తూ ఒక వర్గం వారు దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో మత ఘర్షణలు రేకెత్తి అలజడులు సృష్టించాలని పన్నాగం పన్నుతున్నారని ఆరోపించారు.ఇప్పటికైనా హిందువులంతా ఏకం కావాలని కోరారు. హిందూ సమాజాన్ని దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత హిందువులపైనే ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. హింసను ప్రేరేపించే వారిపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

## సర్కారు భూములకు కరువైన రక్షణ

- ఫిర్యాదులు అందిన స్పందించని రెవెన్యూ యంత్రాంగం
- సర్వే నెం. 156లోని అక్రమాలపై చర్యలు ఉన్నట్టా..? లేనట్టా...?
- అధికారుల నిర్లక్ష్యంతో రెచ్చిపోతున్న ఆక్రమణ దారులు
- రేపు.. మాపు.. చర్యలు అంటూ కాలం గడిపేస్తున్నా తహశీల్దార్



**కుత్బుల్లాపూర్,అక్టోబర్17(మనం న్యూస్) :** కుత్బులాపూర్ నియోజక వర్గం దుండిగల్ గండిమైసమ్మ మండలం పరిధిలో సర్కారు స్థలాలకు రక్షణ కరువైంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న దుండిగల్ మునిసిపాలిటీ, ఔటర్ రింగ్ రోడ్డుకి అతి సమీపంలో ఉండడంతో అక్కడ భూముల విలువ కోట్లల్లో పలుకుతుండడంతో కబ్జాదారుల కన్ను కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలపై పడింది. రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం, అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ, సిబ్బంది నిర్వహణ లోపంతో ప్రభుత్వ స్థలాలు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి.ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ అక్రమార్కులు ఆక్రమణలకు పాల్పడుతున్నారు.ప్రభుత్వ భూమి అని బోర్డులు పెట్టినా.. వాటిని కూడా తొలగించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు.ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ భవనాలు క్రమంగా సక్రమ నిర్మాణాల జాబితాలోకి చేరుతున్నా రెవెన్యూ యంత్రాంగం ప్రేక్షక పాత్రకే పరిమితం కావడం విస్మయానికి కలిగిస్తోంది. ఫిర్యాదులు అందినా స్పందించని రెవెన్యూ యంత్రాంగం దుండిగల్ గండి మైసమ్మ రెవెన్యూ కార్యాలయాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలం సర్వే నెంబర్ 156 లో అక్రమ నిర్మాణాలు మొదలైనప్పటి నుండే రెవెన్యూ అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదులు అందిన... ఇప్పటికి చర్యలు తీసుకోకపోవడంపై అధికారుల విధి నిర్వాహణ ఎంత చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నారు అర్థం చేసుకోవచ్చు. అయితే గతంలో అది ప్రభుత్వ స్థలమేనని చర్యలు తీసుకునేందుకు తహశీల్దార్ మతిన్ సర్వే నంబర్ 156 లో వెలసిన అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసేందుకు తన సిబ్బందితో వెళ్లిన ఎలాంటి చర్యలు తీసుకోకుండా వెనకడుగు వేశారు. అదే విషయంపై ఎమ్మార్వో ను వివరణ అడగగా కోర్ట్ ఆర్డర్ అంటూ తొసిపుచ్చేందుకు ప్రయత్నించారు. కౌంటర్ ఫైల్ చేసి కచ్చితంగా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాలను రక్షిస్తామని తెలిపారు. నెలలు గడుస్తున్నప్పటికి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఇంతవరకు సర్వే నెంబర్ 156లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడంతో తహశీల్దార్ తీరుపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఎప్పుడు సర్వే నెంబర్ 156 విషయంపై వివరణ అడిగిన రేపు మాకు చర్యలు తీసుకుంటామని కాలం గడిపేస్తున్నారు తప్ప చర్యల దిశగా అడుగులు వేయడం లేదని అసలు చర్యలు ఉన్నట్టా? లేనట్టా? అని తహశీల్దార్ తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలకు సహకరిస్తున్న వీఆర్ఏ.కంచే చేను మేసిందా అనే చందగా.... రెవిన్యూ సిబ్బందిలోని ఓ వీఆర్ఏ సర్వే నంబర్ 120 లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలకు లక్షల్లో వసూళ్లకు పాల్పడుతూ సహకరిస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గతంలో ఇలాంటి ఆరోపణలను ఎదుర్కొన్న సదరు వీఆర్ఏపై చర్యలు తీసుకుంటున్నట్టు తహశీల్దార్ తెలిపిన వీఆర్ఏ తీరు మారకపోవడం, అయినా ఉన్నతాధికారులు సదరు వీఆర్ఏపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. సర్వే నంబర్ 120 లో జరిగే అక్రమ నిర్మాణాలను అధికార దృష్టిలో ఉన్నాయని వారి అండదండలతోటే కొనసాగుతున్నాయని, కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్న అందుకే చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు కలుగజేసుకొని దుండిగల్ గండిమైసమ్మ మండల పరిధిలోని జరుగుతున్న సర్కారు స్థలాల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి రక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## హైడ్రాతో హైదరాబాద్‌కు పూర్వ వైభవం



**రంగారెడ్డి,అక్టోబర్17(మనం న్యూస్) :** హైడ్రాతో హైదరాబాద్ కు పూర్వ వైభవం అని మహేశ్వరం నియోజ కవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెనగారి లక్ష్మీరెడ్డి గురువారం విలేఖరుల సమావేశంలో అన్నారు.ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ... మూసీనది డెవల ప్మెంట్ కార్పొరేషన్ ఏర్పా టు చేసి వెనక్కి తగ్గి హైదరాబాద్ ప్రతిష్ఠ, ప్రజలను మోసం చేసిన ఘనత బీఆర్ఎస్ కు దక్కు తుందని మండిపడ్డారు. పర్యావరణ హితమైన పనులు చేపట్టి హైదరాబాద్ ను కాపా డేందుకు హైడ్రా, మూసీ సుందరీకరణ పనులు సీఎం రేవంత్ రెడ్డి చేపట్టారని లక్ష్మీరెడ్డి గుర్తు చేశా రు. పేదలు నష్టపోకుండా పరిహారంతో పాటు డబుల్ బెడ్ రూమ్స్ ఇచ్చి మురికివాడలు లేని నగరంగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోం దని తెలిపారు.మాజీ సీఎం కేసీఆర్ లాగా హుస్సేన్ సాగర్ ను కొబ్బరి నీళ్ల లాగా మార్చు తామని మూసీని సుందరీకరిస్తామ ని గారడి మాటలు చెప్పే సర్కార్ కాదన్నారు. దామగుండం రాడార్ ఏర్పాటుపై అపో హాలు వద్దని.. అన్ని పర్యావరణ హిత మైన ప్రాజెక్టులనే నిర్మిస్తామని తెలిపారు. మహేశ్వరం నియో జకవర్గంలో గత పదేళ్లలో కబ్జా గురైన చెరువులు, పార్కులను కాపాడుతామని లక్ష్మీరెడ్డి హామీ ఇచ్చారు. అదేవిధంగా హైద రాబాద్ రియల్ ఎస్టేట్, డెవ లపర్స్ ను కాపాడుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమా ర్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పిన విషయాన్ని లక్ష్మీరెడ్డి గుర్తు చేశారు. అనంతరం హై డ్రాకు 27 మున్సిపాలిటీలు, 650 చదరపు కిలోమీటర్ల మేర (ఓఆర్ఆర్) అధికారాలను ఏంఏయుడి కట్టబెట్టడంపై హర్షం వ్యక్తం చేశారు.


# మధిర రామభక్త సీతయ్య కళాపరిషత్ బాలోత్సవ్- 2024 పోటీల గోడ పత్రిక ఆవిష్కరణ



**మధిర టౌన్, అక్టోబర్ 17(మనం న్యూస్):** రామభక్త సీతయ్య కళాపరిషత్ మధిర వారి, 27 వ' జాతీయ మధిర బాలోత్సవ్– 2024' పోటీల గోడపత్రికను , అధ్యక్షులు పుతుంబాక కృష్ణ ప్రసాద్ ,సెక్రటరీ మధిర బాబ్లా, ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ మండపం అధ్యక్షులు, కళ్యాణం పుల్లారావు, సెక్రటరీ నాగిరెడ్డి, గుండేల ముత్తయ్య, నరసింహారావు, ప్రజా పాలన న్యూస్ రిపోర్టర్ పసుపులేటి నాగేంద్ర శ్రీనివాస్, గడ్డం సుబ్బారావు,శ్రీనివాసు అనంతచార్యులు,వీరారెడ్డి, చీదిరాల సత్యనారాయణ పాల్గొన్నారు. నవంబర్ 15 ,16 తేదీలలో, బంజారా కాలనీలో ఉన్న వేంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో, పోటీలు జరుగుతాయి. 15 వ తేదీ ఉదయం 10 గంటలకు శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు ఉంటాయి 16 వ తేదీన నీతి పద్యాలు, నీ సత్తా చాటుకో, ఏకపాత్రలు, ఉపన్యాసం, దేశభక్తి గీతాలు, సాయంత్రం ఐదు గంటలకు విచిత్ర వేషాలు ఉంటాయి. ఎంట్రీ ఫారాలు 10 తేదీలోపు, మధిర బాబ్లా ,సెక్రటరీ, హౌస్ నెంబర్ 1–329 బంజారా కాలనీ, మధిర –507 203, ఖమ్మం జిల్లాకు పంపాలని, మరిన్ని వివరాలకు 9440675787 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# నేటికీ ప్రారంభానికి నోచుకోని కొమరం భీం విగ్రహం

- వర్ధంతి రోజు దక్కని గౌరవం



**మహబూబాబాద్, అక్టోబర్17 (మనం ప్రతినిధి) :** గత ప్రభు త్వంలో కొన్ని సంవత్సరాల క్రితం రోడ్డు వెడల్పులో భాగంగా తొల గించిన ఆదివాసీల ఆరాధ్యుడు కొమరం భీం విగ్రహం నేటికి ప్రార ంభానికి నోచుకోలేదు. రెండు నెలల క్రితమే బస్టాండ్ సమీపంలో ఆర్భాటంగా విగ్రహం, శిలాఫలకం ఏర్పాటు చేసినప్పటికీ ప్రారం భించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. విగ్రహంపై ముసుగు వేసి శిలాఫలకంతో మామా అనిపించి చేతులు దులుపుకున్నారని ఆదివాసీలు మండి పడుతున్నారు. ఆదివాసీల ఆరాధ్యదైవం ఐన కొమరం భీమ్ విగ్రహం గత ప్రభుత్వం పాలన నుండి నేటి ప్రభుత్వ పాలన వరకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయ క పోవడం పట్ల పలువురు విమర్శలు చేస్తున్నారు.

### కొమరం భీం వర్ధంతి రోజున దక్కని గౌరవం

గిరి పుత్రుడు (ఆదివాసి) పోరాట యోధుడు, అమరుడు అయినా కొమరం భీం వర్ధంతి గురువారం ఐనప్పటికీ గౌరవం దక్క లేదు. పూల మాల వేసి, నివాళులు అర్పించే దుస్థితి లేకుండా పోయి ందని ఆదివాసీలు వాపోతున్నారు. ఇది కేవలం కొమరం భీం విగ్ర హానికే కాదు. పోరాట స్ఫూర్తికి జరిగిన అవమానం అని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గిరిజన జిల్లా, గిరిజన నియోజకవర్గం అయిన మహబూబాబాద్ లో ఒక గిరిజన (ఆదివాసీ) నాయకుడిని గౌరవించుకోలేని స్థితిలో స్థానిక యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు ఉన్నారన్నది కంటికి కనిపిస్తున్న వాస్తవాలు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో స్ఫూర్తిని రగిలించిన ఆదివాసీ నాయకున్ని గౌరవించు కోలేని స్థితిలో, స్మరించుకోలేని స్థితిలో, స్థానిక అధికార యంత్రా ంగం, ప్రజా ప్రతినిధులు ఉండటం మానుకోట పట్టణం మరియు జిల్లా ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు.

### ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎం డి ఫరిద్ ఇప్పటికైనా బాధ్యతాయుతంగాస్థానిక ఎంపీ, ఎమ్మెల్యే లు, జిల్లా కలెక్టర్ స్పందించి, కొమరం భీం విగ్రహాన్ని ప్రారంభించాలని మహబూబాబాద్ మున్సి పల్ మాజీ వైస్ చైర్మన్ ,27 వ వార్డు కౌన్సిలర్ ఎండి ఫరిద్ కోరు తున్నారు.ఆదివాసి నాయకుడైన కొమరం భీం చరిత్రను గౌరవించ వలసిందిగా ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# మహనీయుల జీవిత చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ
- ఘనంగా వాల్మీకి జయంతి

**ఖమ్మం, అక్టోబర్ 17(మనం బ్యూరో):** ప్రతి సందర్భంలో భవిష్యత్తు తరాలకు మహనీయుల జీవిత చరిత్రను తెలియజేసి వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఆదికవి, రామాయణ గ్రంథ రచయిత మహర్షి శ్రీ వాల్మీకి జయంతి సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి రామాయణ గ్రంథాన్ని రచించి అనేక విలువలను సమాజానికి అందించారని, రామాయణం ద్వారా ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను మహాకవి మనందరికీ బోధించారని, మహాకవి వాల్మీకి జయంతిని అధికారికంగా పండుగ వాతావరణంలో జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు. అనంతరం వక్తలు మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను కొనియా డారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి రాజేశ్వరి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి అరుణ, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్ లు, సిబ్బంది, బి.సి. సంఘం నాయకులు జక్కుల వెంకట రమణ, షకీన, వాల్మీకి సంఘం నాయకులు కె. ఉపేందర్ రావు, డి. శ్రీనివాస్ రావు, ఎం. నరసింహా రావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం నగర అధ్యక్షులు జి. వెంకట రామయ్య, కార్యదర్శి గజవెల్లి లక్ష్మి వరప్రసాద్, ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగబోయిన పుల్లా రావు, ప్రధాన కార్యదర్శి కేతన బోయిన నాగేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరాలపై దాడులు





- జిల్లా ఎస్పీ ఆదేశాలతో కదిలిన పోలీసు యంత్రాంగం
- ఒకే రోజు జిల్లా వ్యాప్తంగా మూకుమ్మడి దాడులు
- పాల్గొన్న 155 మంది సిబ్బంది
- 33 మందిపై కేసులు నమోదు
- గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

**మహబూబాబాద్, అక్టోబర్17 (మనం ప్రతినిధి) :** గుడుంబా స్థావరాలపై మహబూబాబాద్ జిల్లా పోలీసులు ఉక్కు పాదం మోపారు. గుడుంబా నియంత్రణ కోసం జిల్లా వ్యాప్తంగా మూకుముడిగా ఆకస్మిక దాడులు చేపట్టి కేసులు నమోదు చేశారు.మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని మండలంలో గ్రామాలలో మారుమూల ప్రాంతాలలో గురువారం దాడులు నిర్వహించారు. ఉదయం నుంచే గుడుంబా తయారీ కేంద్రాలపై మూకుమ్మడిగా దాడులు చేపట్టి గ్రామస్థులకు గుడుంబా వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు. వాటితో పాటు కొత్త చట్టాలు, సైబర్ నేరలు, ఆన్లైన్, ఆర్థిక మోసాలు, బాల్య వివాహాలు,లైంగిక దాడులు మరియు కఠిన శిక్షల పైన అవగాహన జిల్లా పోలీస్ యంత్రాంగం కల్పించారు.

### 338 లీటర్ల నాటు సారా స్వాధీనం

జిల్లా వ్యాప్తంగా చేపట్టిన గుడుంబా దాడులలో జిల్లా పరిధిలో మొత్తం 338 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే నల్ల బెల్లం 610 కేజీలు, 5840 లీటర్ల బెల్లం, చెక్కర పానకాన్ని ధ్వంసం చేసి గుడుంబా నిర్వాహకులపై 33 కేసులు నమోదు చేసినట్లుగా ఎస్పీ వివరించారు.

### 155 మంది పోలీస్ సిబ్బంది తో దాడులు



జిల్లా వ్యాప్తంగా జరిపిన గుడుంబాదా డులలో డిఎస్పీలు , సీఐలు , ఎస్.ఐలు మరి యు సిబ్బంది కలిపి 155 మంది పాల్గొన్నా రు. మహబూబాబాద్ జిల్లా లో గుడుంబా స్తావరాలపై అలుపెరగని యుద్ధం ప్రకటిం చామని, ఎవరైనా అక్రమంగా గుడుంబా త యారీ చేసినట్లయితే వారిని బైండోవర్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడులు నిర్వ హించిన అనంతరం గ్రామస్థులకు గుడుంబా వాళ్ళ జరిగే నష్టాలని వివరి ంచి అవ గాహన కల్పించారు.నూతన చట్టాలు గురించి, సైబర్ నేరాలు, ఆన్లైన్, ఆర్థిక మోసాలు, బాల్య వివాహాలు, లైంగిక దాడుల గురించి, కొత్త గ్రోవి ంగ్ అమలు చేసే కఠినమైన శిక్షల గురించి అవగాహన కల్పించారు.

### గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు

ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ జిల్లాలో ఎక్కడైనా గుడుంబా తయారీని చేపడితే కఠిన చర్యలు తప్ప వని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒకరిపై ఉందన్నారు. గుడుంబాను త యారు చేసిన లేదా విక్రయించిన అట్టి వారి పై కేసులు నమోదు చేసి జైలు కు పంపడం జరుగుతుందని అన్నారు. గుడుంబా తయారు చేసిన విక్ర యించిన ఆయా ప్రాంతాల పోలీస్ సిబ్బందికి తెలియపరచాలని జిల్లా ప్ర జలకు ఎస్పీ సూచించారు.

# భారతీయ సంస్కృతి, సాంప్రదాయానికి నిలువెత్తు రూపం వీర శివాజీ

- ఎంపీ ఈటెల రాజేందర్
- ఖమ్మంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ



**ఖమ్మం, అక్టోబర్ 17(మనం బ్యూరో):** భారతీయ సంస్కృతి, సాంప్రదాయానికి నిలువెత్తు రూపం వీర శివాజీ అని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని ఏడవ డివిజన్ పరిధిలో గల ఖానాపురం ప్రాంతంలో గురు వారం ఖానాపురం చత్రపతి శివాజీ సంకల్ప యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చత్రపతి శివాజీ విగ్రహాని ఈటెల రాజేందర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఇటీవల భాగ్యనగరంలో ఒక ఆలయం పై జరిగిన దాడిని కొందరు ఆకతాయి చర్యగా భావిస్తూ సదరు సంఘటనను ఆషమాషి గా తీసిపడేస్తున్నారని, ఇది కేవలం ఆలయం పై మాత్రమే కాదు మన విశ్వాసాల మీద జరిగిన దాడి వంటిదని అన్నారు. ఇది క్షమించరాని నేరమని, ఏ మతం కూడా మరో మతం మీద దాడి చేయడానికి ఒప్పుకోదని, పోలీసులు నిందితులపై ఉక్కు పాదం మోపాలని అన్నారు. వీర శివాజీ విగ్రమం ఇక్కడ ఏర్పాటు చేసుకోవడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఛత్రపతి శివాజీ వంటి వీర పురుషుడి గురించి భావితరాలకు ఒక సందేశం, ఒక స్ఫూర్తిగా ఈ విగ్రహం నిలుస్తుందన్నారు. అనేక మతాలకు భారతదేశం నిలయమని, ఇక్కడ అత్యధిక శాతం హిందువులు ఉన్నారని, కొంతమంది పిడికెడు మంది వ్యక్తులు ఈ దేశంలో అశాంతి రగిలించడానికి, విషపు బీజాలు నాటడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, వీటిపై కూడా పోలీసులు దృష్టి సారించాలని సూచించారు. కొంతమంది నాయకులు, కొన్ని పార్టీలు ఆలయంపై దాడి లాంటి ఉన్మాద చర్యలకు బాసటగా నిలుస్తున్నారని, ప్రశాంత వాతావరణంకు మారుపేరుగా ఉన్న భాగ్యనగరంలో ఇలాంటి చర్యలు అశాంతి ప్రభలే ప్రమాదాన్ని కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర ఇలాంటి విషయాలపై సంపూర్ణ సమాచారముందని , తగిన సమయంలో తగిన విధంగా స్పందించడం ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ప్రముఖ డాక్టర్ శీలం పాపారావు, స్థానిక కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, ఖానాపురానికి సంబంధించిన వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి



- భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 17(మనం ప్రతినిధి) :** జిల్లాలో గ్రామపంచాయతీ స్థాయిలో పెండింగ్లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి సమావేశ మందిరంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ స్థాయిలో ఉన్న ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తమ పరిధిలోకి వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను రోజుకు కనీసం 10 దరఖాస్తులు పూర్తి చేసేలా ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో ప్రభుత్వ భూమి,కోర్టు కేసులు, ఎఫ్ టి ఎల్ పరిధిలో ఉందా? అనే విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి భూమి వివరాలు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి ఎలాంటి పొరపాట్లు జరగకుండా వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, జిల్లాలోని అందరూ తాసిల్దార్లు, ఎంపీడీవోలు మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి ఐటిడిఏ:పిఓ



**భద్రాచలం అర్బన్ ,అక్టోబర్ 17 (మనం న్యూస్):** నిరుద్యోగులైన గిరిజన యువకులు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని జీవనోపాధి పెంపొందించుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. గురువారం నాడు ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ట్రైకర్ గ్రామీణ రవాణా పథకం కింద అర్హులైన నిరుద్యోగ గిరిజన యువకులకు మంజూరైన టి ఏ యు 30 జోష్ బ్లూ వాహనాలు, టాటా ఏసీ ఈ వాహనంను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రైకర్ గ్రామీణ రవాణా పథకంలో భాగంగా చర్ల మండలంకు చుంచుపల్లి అశోక్, చీక్కాల సంతోష్ కుమార్ లకు ఒక్కొక్కరికి యూనిట్ కాస్ట్ 8, 31 వేల 45 రూపాయలు కాగా సబ్సిడీ కింద 2,88,000 పోను బ్యాంకు రుణము 4,38, 280 రూపాయలు అందించారని, బెనిఫిషర్ కంట్రిబ్యూషన్ 1,05,175 రూపాయలతో జోష్ బ్లూ బి ఎస్ వాహనాలు అందించడం జరిగిందని, అలాగే ములకలపల్లి మండలం కు చెందిన గోడ నరేష్ యూనిటీ కాస్టు 6,39,875 కాగా, 2,88,000 సబ్సిడీ మరియు బెన్ఫిషర్ కంట్రిబ్యూషన్ 1,06,036, బ్యాంకు రుణము 2,45,839 అందించడంతో టాటా ఏసీ ఈ వాహనము కొనుగోలు చేశారని ఆయన అన్నారు. వాహనాలు తీసుకున్న లబ్ధిదారులు వాహనాలు ఖాళీగా ఉంచకుండా మీ గ్రామాలలో సీజన్లను బట్టి వడ్లు పత్తి మరియు పాల వ్యాపారాలకు సంబంధించిన రవాణా సౌకర్యం కల్పించుకొని జీవనోపాధి పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ ఏమిటి రాజ్, ఇన్చార్జియస్ఓ భాస్కర్, డిఎస్ఓ ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధితో రాణించాలి ఐటీడీఏ:పీవో

**భద్రాచలం అర్బన్, అక్టోబర్ 17( మనం న్యూస్):** పై చదువులు చదివి ఉద్యోగాలు కోసం ఎదురు చూడకుండా స్వస్శక్తితో కుటీర పరిశ్రమ నెలకొల్పుకొని వారి కుటుంబాన్ని పోషించుకోవడమే కాక పదిమందికి ఉపాధి కల్పించడం సంతోషకరమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. గురువారం నాడు తన చాంబర్లో 9, 90 వేల రూపాయల సబ్సిడీ మంజూరైన చెక్కును టేకులపల్లి మండలంలోని నిరుద్యోగులైన ఆరుగురు గిరిజన యువతులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొంది జీవనాధారం పెంపొందించుకోవడానికి 16 లక్షల కాస్ట్ తో సఖి శానిటరీ నాప్కిన్ యూనిట్ నెలకొల్పుకొని, తయారుచేసిన నాప్కిన్లను మహిళా గ్రూపుల ద్వారా అమ్మకాలు జరుపుకొని లబ్ధి పొందుతున్నారని అన్నారు. సఖి శానిటరీ నాప్కిన్ యూనిట్ ఏర్పాటుకు 16 లక్షలు యూనిట్ కాస్ట్ కాగా 9, 90,000 సబ్సిడీ మరియు లక్ష65,000 బెనిఫిషర్ కంట్రిబ్యూషన్, బ్యాంకు రుణము 4,95,000 అందించడంతో యూనిట్ ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. నిరుద్యోగులైన గిరిజన యువతులు చిన్న తరహా పరిశ్రమలు స్థాపించుకొని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ,బాణావత్ పుల్లమ్మ, మాలోత్ కరుణ, గౌస్య, చిట్టెమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.




# అశ్వరావుపేట నుండి ఏలూరు వెళ్లాలంటే ఇక్కట్లే...

- సరైన బస్సు సౌకర్యం లేక ప్రయాణికులకు ఇబ్బందులు



**అశ్వారావుపేట, అక్టోబర్ 17 (మనం న్యూస్) :** ప్రయాణికులు తమ తమ గ్రామాల నుంచి ఇతర గ్రామాలకు ప్రయాణం చేయాలంటే సురక్షితమైన ప్రయాణం కోసం బస్సుల కోసం వేచి చూస్తున్నారు. ఈ రోడ్డు మార్గాన ప్రయాణించాలంటే గంటల తరబడి వేచి ఉండాల్సిందే. అశ్వారావుపేట బస్సు స్టేషన్ నుండి జంగారెడ్డిగూడెం, ఏలూరు దాదాపు 100 కిలోమీటర్ల పైన ప్రయాణం చేసే ప్రయాణికులు అశ్వారావుపేట మార్గాన వెళ్ళడానికి బస్సులు సరైన సమయంలో బస్సులు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాలను ఎవరు పట్టించుకోవడం లేదని అంటున్నారు. దూరం ఎక్కువ బస్సులు తక్కువ కావడంతో ఎప్పుడు వస్తాయో ఎప్పుడు పోతాయో తెలియక బస్సు షెల్టర్ల వద్ద ప్రయాణికులకు ఎదురు చూపులే మిగులుతున్నాయి.ప్రభుత్వం దృష్టి సారించి ఈ ప్రధాన రోడ్డు మార్గంలో ప్రయాణికులు అధికంగా ప్రయాణిస్తునందు వల్ల బస్సులు పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి 30 నిమిషాలకు బస్సు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# పదోన్నతిపై వెళ్తున్న జడ్జికి ఘన సన్మానం

**దమ్మపేట, అక్టోబర్ 17 (మనం న్యూస్):** దమ్మపేట బార్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జిగా పని చేసి పదోన్నతిపై వెళ్తున్న బత్తుల రామారావును గురువారం ఘనంగా సన్మానించారు. ముందుగా జడ్జి దంపతులను సన్మానించి మెమొంటోను అందచేశారు. ఈ కార్యక్రమంలో జడ్జి బత్తుల రామారావు మాట్లాడుతూ దమ్మపేట కోర్టు నందు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసి సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పై కొత్తగూడెం సీనియర్ కోర్టుకు వెళ్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. తన ఉద్యోగ కాలంలో సహకరించిన న్యాయవాదులకు కోర్టు సిబ్బందికి, పోలీసులకు, దమ్మపేట కోర్ట్ కక్షిదారులు కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు మారం సతీష్ కుమార్ , జనరల్ సెక్రెటరీ గొంది మురళీ మోహన్, సీనియర్ న్యాయవాదులు ఉడతనేని శ్రీను,శ్యామ్ సుధాకర్,లక్కినేని నరేంద్ర,సంజయ్, ఉదయ్, భవాని కృష్ణ యాదవ్, కాలం సంధ్యా అరుణ కుమారి,ఇతర మహిళ న్యాయవాదులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ అనురాగాలకు ప్రతీక లతీఫ్ షాప్ ఉర్సు దర్గా

- ప్రారంభమైన ఉర్సు ఉత్సవాలు
- నాలుగు రాష్ట్రాల నుండి భక్తుల రాక
- భక్తుల కొంగుబంగారంగా పేరుగాంచిన దర్గా

**నలగొండ,అక్టోబర్ 17 (మనం ప్రతినిధి) :** ప్రేమ అనురాగాలకు ప్రతీకగా నిలిచింది నల్లగొండ పట్టణంలోని సయ్యద్ హజరత్ లతీఫ్ ఉల్లా ఖాద్రి దర్గా ..భక్తులకు కొంగు బంగారంగా పేరుగాంచింది. ఈ దర్గాకు సంబంధించిన ఉర్సు ఈ సంవత్సరం రానే వచ్చింది.ఈనెల 17వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు.నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు తెలంగాణలోని అన్ని జిల్లాల నుండి ఏ కాకుండా ఆంధ్రప్రదేశ్ ,కర్ణాటక, ఛత్తీస్గడ్ రాష్ట్రాల నుండి భక్తులు రానున్నారు. భక్తుల కొంగుబంగారంగా పేరుగాంచిన ఈ దర్గా నల్గొండ పట్టణంలో నడిబొడ్డున గల గుట్టమీద ఉంది కనుక ఈ గుట్టకు లతీఫ్ సాబ్ గుట్ట అని పేరు ఉన్నది.

### దర్గా నేపథ్యం.... పూర్వ చరిత్ర


క్రీస్తు శకం 950 సంవత్సరంలో ఇరాన్ దేశానికి చెందిన హజరత్ సయ్యద్ లతీఫ్ ఉల్లా షా ఖాద్రి మత బోధనలు చేయడానికి నల్గొండ జిల్లాలోని జిల్లా కేంద్రంలోని గుట్టపైకి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని అక్కడే భక్తులకు బోధనలు చేస్తూ వారికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ ఉండే వారు. అదేవిధంగా అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ఆయన తన మహిమల ద్వారా బాగు చేసేవారు. ఈ విధంగా అందరికీ మంచి చేస్తూ ఆయన అక్కడే చనిపోవడంతో సమాధి కూడా గుట్టపైన కట్టారు .ఆ సమాధి ఉన్న ప్రాంతాన్ని ప్రస్తుతం దర్గా అని పిలుస్తున్నారు .లతీఫ్ సాబ్ మరణానంతరం ఆయన అన్నా కుమారులు కూడా గుట్టపైనే బోధనలు చేస్తూ అందరికీ మంచి చేసేవారు.



భక్తుల కొంగుబంగారంగా లతీఫ్ సాబ్ దర్గా

భక్తుల కొంగు బంగారంగా లతీఫ్ దర్గా పేరుగాంచింది. గుట్ట ఎక్కాలి అంటే మొత్తం వెయ్యి మెట్ల వరకు ఉన్నాయి. మెట్లు ఎక్కలంటే కనీసం ఒక గంట సమయం పడుతుంది .దిగేటప్పుడు సులువు గనుక అరగంటలో కిందికి దిగవచ్చు. ఈనెల 17వ తేదీన ఉత్సవాలను ప్రారంభించడానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి ,ఎస్పీ శరత్చంద్ర పవర్ లు వచ్చారు . శుక్రవారం శనివారం ఆదివారం వరకు ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. గుట్టను ఎక్కలేని వారు మెట్ల దగ్గరనే తమ మొక్కులను చెల్లించుకోవచ్చు. మూడవరోజు ఆదివారం కావలి అనే సాంస్కృతిక కార్యక్రమాలు కార్యక్రమం నిర్వహించనున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కావాలి బృందం ప్రత్యేకంగా వచ్చి ఇక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

### వెలసిన దుకాణాలు , ఆహ్లాదకరమైన వాతావరణం



లతీఫ్ షా ఉత్సవాలు ప్రారంభం గనుక గుట్ట ప్రధాన ద్వారం వద్ద గల మైదానంలో రకరకాల దుకాణాలు గెలిచాయి. అందులో మహిళలకు సంబందించిన గాజుల దుకాణాలు, మేక్ అప్ కు సంబంధించిన దుకాణాలు, మిఠాయి దుకాణాలు, మిక్చర్ దుకాణాలు, పిల్లల బొమ్మల దుకాణాలు, కొబ్బరికాయల దుకాణాలు ,అగరవత్తుల దుకాణాలన్నీ కూడా వెలిశాయి. వాస్తవానికి ఉర్సు నాలుగు రోజులపాటు జరిగిన నెలలపాటు దుకాణాలు ఉంటాయి. ప్రతిరోజు మధ్యాహ్నం నుండి దుకాణాలు తెరవడం ప్రారంభి స్తారు రాత్రి 11:00 వరకు దుకాణాలు తెరిచే ఉంటాయి . గుట్ట దగ్గర ఆహ్లా దకరమైన వాతావరణం చోటుచేసుకుని ఉంటుంది.

### భక్తులకు ఇబ్బందులు కలవకుండా అన్ని రకాలుగా సౌకర్యాలు కల్పించాము

### ఎండి సమీవుల్లా ఖాద్రి - దర్గా మూతవల్లి

లతీఫ్ సాబ్ దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాలుగా చర్యలు తీసుకున్నాము నలువైపుల నుండి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా మంచినీటి సౌకర్యం కల్పించాము. గుట్టపై కూడా మంచినీటి సౌకర్యాన్ని కల్పించడం జరిగింది .విద్యుత్ సౌకర్యం కూడా 24 గంటలు ఉంటుంది వచ్చే భక్తులు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలి.

## ఐకెపి సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే వేముల వీరేశం



**నకిరేకల్, అక్టోబర్ 17(మనం న్యూస్) :** నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామంలో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఐకేపి ధాన్యం కొనుగోలు మార్కెట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే వేముల వీరేశం.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతు సోదరులు మరియు సిబ్బంది ఒకరికొకరు సమన్వయం చేసుకొని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా ధాన్యం సేకరణ జరగాలని సూచించారు.అనంతరం స్థానిక కాంగ్రెస్ నేత బిజిఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్ రావు మాట్లాడుతూ... అధికారులుసిబ్బంది రైతులు ధాన్యం అమ్ముకోవడానికి అన్ని సౌకర్యాలను కలిపించి,రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వారికి నిరంతరం అందుబాటులో వుండాలని సూచించారు.ఈకార్యక్రమంలో పిఏసిఏస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు,తాసిల్దార్ జమారుద్దీను,ఎంపిడిఓ చంద్రశేఖర్,పిఏసిఏస్ డైరెక్టర్ బచ్చుపల్లి బుజంగరావు,గొడ్డేటి సైదులు యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం,గ్రామ ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఐకేపి అధికారులుసిబ్బంది,సంఘుబందం సభ్యులు, హమాలీలు,రైతు సోదరులు మరియు గ్రామ యువత పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులను పరిశీలించిన ఏంఎస్ఓ



**అడవిదేవులపల్లి,అక్టోబర్ 17 (మనం న్యూస్) :** మండల పరిధిలోని ముదిమాణిక్యంగ్రామపంచాయతీ లోని పారిశుధ్య పనులను గురువారం నాడు ఏంఎస్ఓ ఆర్ దస్రు నాయక్ సందర్శించి పరిశీలించినారు.గ్రామ పరిధిలో పారిశుధ్య సామాగ్రి స్టాక్ బ్లీచింగ్ పౌడర్, గ్రాస్ కటింగ్ మిషన్, ఫాగింగ్ మిషన్ మొదలగు లాగ్ పుస్తకంతో సహా అయన పరిశీలించినారు.తదుపరి గ్రామ పరిధిలోని ఓ హెచ్ ఎస్ఆర్ ట్యాంక్ ను పరిశీలించి పారిశుధ్యం గురించి అధికారులకు సూచనలు చేసినారు.అదేవిదంగా అంగన్వాడీ సెంటర్, పాఠశాల, హెల్త్ సబ్ సెంటర్ లోని రికార్డ్ లను పరిశీలించినారు.అనంతరం స్మశాన వాటిక మరియు సెగ్రీ గేషన్ షెడ్ కంపోస్ట్ సిద్ధం చేస్తున్న విధనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినారు వారి వెంట .ఎంపిడివో (ఇంచార్జి) ఎండి మొహాసిన్ బిన్ అహ్మద్ , ఏపీఓ లావుడి సూర్య నాయక్ , పిఎస్ టి ఏ , అంగన్వాడీ టీచర్స్, ఆశ వర్కర్స్ తదితరులు ఉన్నారు.

## మృతదేహం లభ్యం



**త్రిపురారం,అక్టోబర్ 17(మనం న్యూస్) :** ఖమ్మంలోని సాయి గణేష్ నగర్ కు చెందిన కన్నెగంటి గోపి కిషోర్ తండ్రి బాపనయ్య వయసు 57 సంవత్సరాలు అను అతను గత నాలుగు సంవత్సరాల నుండి మానసిక ఆరోగ్య పరిస్థితి బాగా లేక గత నాలుగు సంవత్సరాలుగా పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుండడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం లో గల కృష్ణ నర్సింగ్ హోమ్ నందు చూపించడం జరిగిందని అయిన కానీ అతను కొన్ని రోజులు మంచిగా ఉండి తర్వాత కొన్ని కూ రోజులు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయట తిరిగి ఇంటికి వచ్చె వాడిని అదేవిధంగా ఈ నెల 12వ తేదీ నా తన ఇంట్లో నుండి బయటకు వచ్చినారని 17/10/2024 రోజు ఉదయం అందాజ ఏడు గంటల సమయంలో త్రిపురారం మండలం నీలయగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గంటారావు క్యాంపు వెళ్లే దారిలో ఎన్ఎస్పి కాలువ ముది మాణిక్యం మేజర్ వద్ద కాలువలో పడి చనిపోవడం జరిగిందని మృతుని కుమారుడు హరిదీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు వి శ్రీనివాస్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

## డిగ్రీ, పీజీ కళాశాలల బంద్ తాత్కాలికంగా విరమణ

- రేపటినుండి డిగ్రీ, పీజీ కళాశాలలో పున ప్రారంభం

**నల్లగొండ,అక్టోబర్ 17(మనం న్యూస్) :** ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన డిగ్రీ పీజీ కళాశాల బందు ను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఉమ్మడి నల్లగొండ జిల్లా డిగ్రీ పీజీ కళాశాల అసోసియేషన్ అధ్యక్షుడు మారం నాగేందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంలు ఇచ్చిన హామీ మేరకు బందును తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ఆయన తెలిపారు. గత సంవత్సరం జారీ చేసిన టోకెన్లు మొత్తం వారం లోపల విడుదల చేస్తామని రాష్ట్ర నాయకుల సమక్షంలో సెక్రటరీ బుర్ర వెంకటేశం హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల ప్రకారం బందును తాత్కాలికంగా విరమించి రేపటినుండి కళాశాలలు పునః ప్రారంభిస్తామని తెలిపారు.ప్రభుత్వంతో చర్చించడానికి సహకరించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్యకు .సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బి సూర్యనారాయణ రెడ్డి, కార్యదర్శి వై రామకృష్ణ లకు కళాశాల యజమానులకు, విద్యార్థి సంఘ నాయకులకు, ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## డయేరియా కేసులను డా. సతీష్ పరిశీలన



**చింతలపాలెం,అక్టోబర్ 17 (మనం న్యూస్) :** చింతలపాలెం గ్రామంలో ఈ మధ్యకాలంలో సంక్రమించిన డయేరియా కేసుల ను డా . సతీష్ ఎపిడేమియాలజిస్ట్ చింతలపాలెం ముత్యాలమ్మ గుడి విదిలో సందర్శించి డయేరియా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు, కేసుల వ్యాప్తి దాని నివారణకు చేయవలసిన జాగ్రత్తలు, మరియు పరిసరాల పరిశుభ్రత కాచి చల్లార్చిన నీటిని తాగాలి, ఇంటి చుట్టుప్రక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలి, సిబ్బందిని వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలి.ఈ కార్యక్రమంలో వీరయ్య గణాంక అధికారి , చింతలపాలెం డాక్టర్ సచిన్ మరియు హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి మేళ్లచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెయిల్ సూపర్వైజర్ రాజకుమార్, హెల్త్ అసిస్టెంట్ రాములు, సి హెచ్. నాగ కళ్యాణి ఏఎన్ఎంలు, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్, ఆశా కార్యకర్తలు పర్యవేక్షణ చేసినారు.

## అన్ని దానాల కన్నా మహాదానం రక్తదానం



**కోదాడ,అక్టోబర్ 17 (మనం న్యూస్) :** అన్ని దానాల కన్నా గొప్ప దనం రక్తదాన ం,రక్తదానం చేయండి మరి ఒకరికి ప్రాణదా తలుగా నిలబడండి అని ఎంబిఎం ట్ర స్టు సభ్యులు అన్నారు. గురువారం కోదాడ ఉషా నర్సింగ్ హోమ్ లో కోడి అనుష సూర్యాపేట వారికి అత్యవసర ఆపరేషన్ నిమిత్తం బి పాజిటివ్ బ్లడ్ అవసరం అని డాక్టర్ చెప్పడంతో తెలుసుకున్న ఎంబిఎం గ్రూప్ సభ్యులైన కోదాడ కు చెందిన హర్ష స్టూడియో బాలు వారికి బ్లడ్ ఇచ్చి ప్రాణదాతగా నిలిచారు.ఈ సందర్భంగా గ్రూపు సభ్యులు మాటా్లడుతూ ట్రస్ట్ ద్వారా ఇప్పటివరకు ఎం తోమందికి రక్తాన్ని అందించి ప్రాణదాతగా నిలుస్తున్నా మని తెలిపారు. రాబోయే రోజులలో ఈ ట్రస్టు ద్వారా ఎంతోమందికి రక్తం అందించడానికి సహకరిస్తున్న గ్రూపు సభ్యులకు ప్రత్యే కమైన ధన్యవాదాలు తెలియజేశారు. బాలు ఇప్పటివరకు ఎంబీఎం ట్రస్టు ద్వారా 06 సార్లు బ్లడ్ ఇవ్వడం జరిగి ందని వారికి ఎంబిఎం ట్రస్టు సభ్యుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటివరకు ఈ ట్రస్ట్ కు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ట్రస్టు తరపున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్ర మంలో ఎంబిఎం ట్రస్ట్ సభ్యులు తది తరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ సృష్టికర్త వాల్మీకి విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవం



**నల్లగొండ,అక్టోబర్ 17(మనం న్యూస్) :** సృష్టికర్త వాల్మీకి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వాల్మీకి జయంతి ఉత్సవాల సందర్భంగా నల్గొండ పట్టణం లోని 45వ వార్డ్ లో గల వాల్మీకి నగర్ లో వాల్మీకి దేవాలయంలో సృష్టికర్త వాల్మీకి విగ్రహన్ని పునః ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రసిడెంట్ శంకర్ నాయక్, పార్టీ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి హాజరై, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణాన్నే నేడు మనం చదువుకుంటున్నామని అన్నారు. వాల్మీకి నగర్ కాలనీ వాసులకు, భక్తులకు వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ సందర్భంగా వాల్మీకి భక్తులు మాట్లాడుతూ గత మూడు రోజులుగా వాల్మీకి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుంటున్నామని, ఈ నెల 15 వ తేదీన సాయంత్రం గ్రామ ఉత్సవం 16 వ తేదీన జలాది వాస, పుష్పాదివాసం నేడు యంత్ర ప్రతిష్ట, పంచామృత అభిషేకం, మృత్తికా స్నానం, హోమం, పూర్ణహతి, నేత్రో ఉల్మకనం, వాల్మీకి విగ్రహ ప్రతిష్ట, తీర్థ ప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు సహకరించిన దాతలకు, భక్తులకు, కాలనీ వాసులకు ధన్యవాదాలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఆమేర్, ఆలయ అర్చకులు సుదర్శనాచార్యులు, చిండాలియా పాండు వాల్మీకి పండిత్, ఆలయ సేవకులు పార్చ రామ్ పాల్, బేద్ రాం పాల్ - బాల, సుదర్శన్, విగ్రహ దాత రోతష్ కుమార్, దీపక్ చందాలియా, దీపక్ వాల్మీకి, సంజు భాయ్, ఓం భీర్ సింగ్, గౌకరన్ ఛండాలియా, శారద, జద్విర్ సింగ్, ఓం ప్రకాష్ బిర్లా, రాజ్ కుమార్ సింగ్, ఇంద్రపాల్, లక్ష్మి నారాయణ, రాజ్ కుమార్, చోళ్ళేటి రమేష్, దామోదర్, దర్శన్ సింగ్, పురుషోత్తం, అంబటి ముత్యాలు, విజయేందర్ రెడ్డి, పాషా రాంపాల్ బాగిడి అర్జున్, రాహుల్, స్వప్న, ఓంపాల్, మురారి, రవి, పాండు, లక్ష్మణ్, భగవాన్, షీలా, ఇంద్రకలి మరియు కాలనీ వాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలల హక్కులను కాపాడాలి

- విచక్షణా రహితంగా మైనర్ విద్యార్థిని కొట్టిన ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలి

**భువనగిరి, అక్టోబర్17(మనం న్యూస్) :** భువనగిరి పట్టణంలోని సిద్దార్థ ఐటిఐలో డీజిల్ మెకానిక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి పొన్నెబోయిన శివకుమార్ (17) ను, సిద్దార్థ ఐటిఐ ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి విచక్షణా రహితంగా కొట్టడం చాలా దారుణమని బాలల హక్కుల పరిరక్షణ వేదిక యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు కొడారి వెంకటేష్ అన్నారు. గురువారం ఐటిఐ లో బాదిత విద్యార్థి శివ కుమార్ ను కొడారి వెంకటేష్ పరామర్శించారు.అనంతరంఆయన మీడియాతో మాట్లాడుతూ మైనర్ విద్యార్థుల పట్ల ప్రిన్సిపాల్ అరాచకాలు ఆగడాలు ఎక్కువయ్యాయని బూతు మాటలతో తిడుతూ విద్యార్థులను మానసికంగా శారీరకంగా హింసిస్తున్నాడని ఆయన ఆరోపించారు. ఐటిఐ విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉంటే డబ్బులు వసూలు చేయడం, వార్షిక పరీక్షలు రాయడానికి డబ్బులు, చివరకు పాసైన తరువాత సర్టిఫికెట్ లు తీసుకోవడానికి కూడా ప్రిన్సిపాల్ డబ్బులు(2000 రూపాయలు) వసూలు చేస్తున్నాడని ఆయన డబ్బులు ఎందుకు అని అడిగితే నేను సర్టిఫికెట్ల దగ్గర డబ్బులు ఇచ్చి తీస్తున్నానని బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నాడనీ ఆరోపించారు. బాధిత విద్యార్థి గత వారం రోజులుగా కామెర్లతో అనారోగ్యంతో బాధపడుతున్నాడని కనీసం మానవత్వం లేని ప్రిన్సిపాల్ కోపంతో కర్రతో విచక్షణ కోల్పోయి శరీరం పై వాతలు వచ్చే విధంగా కొట్టడం బాలల హక్కుల



ఉల్లంఘనగా మేము భావిస్తున్నామని ఆయన అన్నారు. మూడు మాసాల క్రితమే ఐటిఐ లో చేరిన విద్యార్థి పదవ తరగతి మెమో తెమ్మని చెప్పినా తేలేదనే కోపంతో ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి అగ్రకుల అహంకారంతో, దొర పోకడలతో, నియంతృత్వ దోరణులతో విద్యార్థుల పట్ల, తల్లిదండ్రుల పట్ల కరంగా ప్రవర్తిస్తున్నాడని ఆయన ఆరోపించారు. మైనర్ విద్యార్థి శివ కుమార్ ను బూతు మాటలతో మానసికంగా హింసించడమే కాకుండా శారీరకంగా గాయపరచిన ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని అతన్ని బాలల హక్కుల చట్టం ప్రకారం శిక్షించాలని కొడారి వెంకటేష్ డిమాండ్ చేశారు.

# మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా



- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

**తిరుమలగిరి,అక్టోబర్ 17(మనం న్యూస్) :** తిరుమలగిరి మున్సిపాలిటీని ఒక మోడల్ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలగిరి మున్సిపాలిటీ లోని సిసి రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, ఐదు మంచినీళ్ల ట్యాంకులకు 30 కోట్ల తో నిర్మాణం అవుతాయని చెప్పారు. నందాపురం నుండి అనంతారం లింక్ రోడ్, మాలిపురం వెళ్లే రోడ్లను డబల్ రోడ్లుగా మార్చడానికి ప్రతిపాదించుతున్నామని చెప్పారు. సర్వీస్ రోడ్ల వెంట మరుగుదొడ్లు మూత్రశాల ఏర్పాటు చేస్తానని చెప్పారు. మున్సిపాలిటీకి ఇప్పటికి 10 కోట్ల రూపాయలు మంజూరు చేయించానని అందులో ఆరు కోట్ల రూపాయలకు టెండర్లు అయ్యాయని పనులు జరుగుతున్నాయని చెప్పారు. తిరుమలగిరి పెద్ద చెరువు దగ్గర బతుకమ్మ ఘాటును సుందరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని చెప్పారు. 30 కోట్లతో అమృత స్కీం కింద 5 మంచి నీళ్ళ ట్యాంకులు నిర్మాణం అవుతాయని చెప్పారు. తిరుమలగిరి లో 30 పడకల ఆసుపత్రి చేయడానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను తీసుకొచ్చానని, అందులో విద్యార్థులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని చెప్పారు. తొండ గ్రామంలో 300 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ స్కూలు శంకుస్థాపన చేశామని త్వరలో టెండర్లు కూడా అవుతాయని చెప్పారు. మున్సిపాలిటీని అందరి సహకారంతో తీర్చిదిద్దుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చాగంటి అనసూయరాములు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న, మండల పార్టీ అధ్యక్షులు వై.నరేష్, పట్టణ శాఖ అధ్యక్షులు పేరాల వీరేష్, జిల్లా నాయకులు సుంకర జనార్ధన్, వార్డు కౌన్సిల్ బత్తుల శ్రీనివాస్, కందుకూరి లక్ష్మయ్య, తిరుమని యాదగిరి, సుధాకర్,నాయిని కృష్ణయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల నమోదు

**తిరుమలగిరి,అక్టోబర్ 17(మనం న్యూస్) :** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాటశాలలో పీఅర్ టి యు ఆద్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీ అర్ టి యు సూర్యాపేట జిల్లా శాఖ అధ్యక్షులు తంగెళ్ళ జితేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగల నరేష్ మండల అధ్యక్ష కార్దర్శులు, కె అశోక్ రెడ్డి,బి.లక్ష్మణ్, మండల విద్యాధికారి ఐ. శాంతయ్య , గెజి టెడ్ ప్రధానోపాధ్యాయులు దామెర శ్రీనివాస్ , రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్. వెంకటేశ్వర్లు , దయాకర్ జిల్లా ఉపాధ్యక్షులు ఉపేంద్ర ,. అశోక్ , కృష్ణారెడ్డి , లింగారావు , అసి ఫ్ అలీ, నర్సయ్య, మున్వర్ అలీ, యాదగిరి, విజ యలక్ష్మి , భానుప్రియ, రవీందర్ పాల్గొన్నారు.



మనం

Follow : @Manamnews



# 400 అన్నాడు.. 46కే ఆలౌటైన టీమిండియా!

## టీమిండియా ఘోర వైఫల్యం..

**• న్యూజిలాండ్కు భారీ ఆధిక్యం!**



న్యూజిలాండ్తో తొలి టెస్ట్లో టీమిండియా దారుణంగా విఫలమైంది. చెత్త బ్యాటింగ్తో 46 పరుగులకే కుప్పకూలిన రోహిత్ సేన.. బౌలింగ్లోనూ అదే తడబాటు కొనసాగించింది. చెత్త ఫీల్డింగ్తో వచ్చిన అవకాశాలను చేజార్చుకుంది. దాంతో న్యూజిలాండ్ పై చేయి సాధించింది. భారీ ఆధిక్యం దిశగా దూసుకెళ్తోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ 50 ఓవర్లలో 3 వికెట్లకు 180 పరుగులు చేసింది. క్రీజులో రచిన్ రవీంద్ర(22 బ్యాటింగ్)తో పాటు డారిల్ మిచెల్(14 బ్యాటింగ్) ఉన్నారు. ప్రస్తుతం న్యూజిలాండ్ 134 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది. టామ్ లాథమ్(15) విఫలమైనా.. డెవాన్ కాన్వే(91), విల్ యంగ్(33) రాణించారు. భారత బౌలర్లలో అశ్విన్, కుల్దీప్ యాదవ్, జడేలా తలో వికెట్ తీసారు. వర్షం కారణంగా తొలి రోజు ఆట తుడిచి పెట్టుకుపోగా.. రెండో రోజు ఆటలో టాస్ గెలిచిన టీమిండియా బ్యాటింగ్కు దిగింది. టీమిండియా తొలి ఇన్నింగ్స్లో 31.2 ఓవర్లలో 46 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(49 బంతుల్లో 2 ఫోర్లతో 20), యశస్వి జైస్వాల్(63 బంతుల్లో ఫోర్తో 13) మాత్రమే డబుల్ డిజిట్ స్కోర్ చేయగా.. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్కే పరిమితమయ్యారు. ఐదుగురు బ్యాటర్లు ఖాతా తెరవకుండానే వెనుదిరిగారు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ(5/15), విలియమ్ ఓ రౌర్కే(4/22), టీమ్ సౌథీ(1/8) భారత్ పతనాన్ని శాసించారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే సొంతగడ్డపై టీమిండియాకు ఇదే లోయేస్ట్ స్కోర్. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన న్యూజిలాండ్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసింది. భారత బ్యాటర్లు తడబడ్డ వికెట్పై ఎలాంటి తడబాటు లేకుండా ఇన్నింగ్స్ను ముందుకు నడిపించింది. టామ్ లాథమ్ ఇచ్చిన సునాయస క్యాచ్ను కేఎల్ రాహుల్ నేలపాలు చేయగా.. అతన్ని కుల్దీప్ యాదవ్ పెవిలియన్ చేర్చాడు. అనంతరం విల్ యంగ్ ఇచ్చిన సునాయస క్యాచ్ రోహిత్ శర్మ వదిలేయగా... రవీంద్ర జడేజా రనౌట్ అవకాశాన్ని వృథా చేశాడు. టీమిండియా ఆటగాళ్లు చేసిన తప్పిదాలు న్యూజిలాండ్కు కలిసొచ్చాయి. విల్ యంగ్ను జడేజా ఔట్ చేయగా.. సెంచరీకి చేరువైన డెవాన్ కాన్వేను అశ్విన్ క్లీన్ బౌల్ చేశాడు. ఇక రిషభ్ పంత్ తీవ్ర గాయంతో మైదానం వీడగా.. ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ చేశాడు. వెలుతురు మందగించడంతో నిర్ణీత సమయం కన్నా ముందే అంపైర్లు ఆటను ముగించారు. వీలైనంత త్వరగా న్యూజిలాండ్ను ఆలౌట్ చేస్తేనే టీమిండియా ఈ మ్యాచ్లో గట్టెక్కగలదు. లేకుంటే ఘోర పరాజయం తప్పదు.



టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్పై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యూజిలాండ్తో బెంగళూరు వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్లో టీమిండియా 46 పరుగులకే ఆలౌటవ్వడంపై మండిపడుతున్నారు. టాస్ గెలిచిన తర్వాత బౌలింగ్ తీసుకోకుండా బ్యాటింగ్ తీసుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. స్వింగ్ కండిషన్స్లో న్యూజిలాండ్ బౌలర్లు నిప్పులు చెరగడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్లో 46 పరుగులకే కుప్పకూలింది. రిషభ్ పంత్(49 బంతుల్లో 2 ఫోర్లతో 20), యశస్వి జైస్వాల్(63 బంతుల్లో ఫోర్తో 13) మాత్రమే డబుల్ డిజిట్ స్కోర్ చేయగా.. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్కే పరిమితమయ్యారు. ఐదుగురు బ్యాటర్లు ఖాతా తెరవకుండానే వెనుదిరిగారు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ(5/15), విలియమ్ ఓ రౌర్కే(4/22), టీమ్ సౌథీ(1/8) భారత్ పతనాన్ని శాసించారు. దాంతో టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే సొంతగడ్డపై టీమిండియా అత్యల్ప స్కోర్ నమోదు చేసింది. దాంతో గంభీర్ను నెటిజన్లు ఆడుకుంటున్నారు. సోషల్ మీడియా వేదికగా అతన్ని జుగుప్సాకరమైన రీతిలో ట్రోల్ చేస్తున్నారు. ఈ సిరీస్ ప్రారంభానికి ముందు గంభీర్.. టీమిండియా బ్యాటింగ్ అప్రోచ్ను వివరిస్తూ కీలక వ్యాఖ్యలు చేశాడు. తమ జట్టు ఒకే రోజులో 400 పరుగులు చేయడంతో పాటు అవసరమైతే రెండు రోజులు బ్యాటింగ్ చేసి మ్యాచ్ను డ్రా చేసేలా తీర్చిదిద్దాలనుకుంటున్నామని చెప్పాడు. పరిస్థితులకు అందిపుచ్చుకునేలా తయారు చేయాలనుకుంటున్నామని తెలిపాడు. ఈ వ్యాఖ్యలను గుర్తు చేస్తూ నెటిజన్లు సెటైర్లు పేల్చుతున్నారు. 400 పరుగులేమో కానీ 46 రన్స్కే ఆలౌటయ్యారని విమర్శలు గుప్పిస్తున్నారు. గౌతమ్ గంభీర్.. బెంగళూరు ప్రేక్షకుల నోళ్లను మరోసారి మూయించాడని, ఐపీఎల్ 2023 సీజన్ సందర్భంగా చోటు చేసుకున్న ఓ ఘటనను గుర్తు చేస్తున్నారు. బెంగళూరు బేస్డ్ ఫ్రాంచైజీ ఆర్సీబీ 49 పరుగులకు ఆలౌటైన రికార్డ్ను గంభీర్ పర్యవేక్షణలోని టీమిండియా అధిగమించిందని వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. డ్రెస్సింగ్ రూమ్లోకి వచ్చిన తర్వాత భారత ఆటగాళ్ల పనిచెబుతాడని మరికొందరు కామెంట్ చేస్తున్నారు. మూడు టెస్ట్ల సిరీస్లో భాగంగా బుధవారం ప్రారంభమైన ఈ మ్యాచ్లో తొలి రోజు ఆట వర్షార్పణమైంది. భారీ వర్షం కారణంగా టాస్ కూడా సాధ్యం కాలేదు. దాంతో రెండో రోజు .. టాస్ గెలిచిన టీమిండియా బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ అనూహ్యంగా పిచ్ బౌలింగ్కు అనుకూలించడం.. వికెట్ కవర్లు కప్పి ఉంచడంతో మాయిశ్చర్ వచ్చి స్వింగ్కు అనుకూలించడంతో భారత బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. కివీస్ బౌలర్లను ఎదుర్కోలేక వరుసగా పెవిలియన్ చేరారు.

## రిషభ్ పంత్కు తీవ్ర గాయం!



మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లుంది టీమిండియా పరిస్థితి. న్యూజిలాండ్తో తొలి టెస్ట్లో టీమిండియాను కష్టాలు వెంటాడుతున్నాయి. పేలవ బ్యాటింగ్తో 46 పరుగులకే కుప్పకూలి చెత్త రికార్డ్ నమోదు చేసిన రోహిత్ సేన.. బౌలింగ్లోనూ అదే తడబాటును కొనసాగిస్తోంది. మరోవైపు టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ తీవ్రంగా గాయపడ్డాడు. వికెట్ కీపింగ్ చేస్తుండగా బంతి నేరుగా అతని మోకాలికి తగలడంతో పంత్ కుప్పకూలాడు. సర్జరీ అయిన చోటే బంతి బలంగా తాకడంతో నొప్పితో విలవిలలాడాడు. ఫిజియోలు వచ్చి ప్రథమ చికిత్స అందించినా లాభం లేకపోయింది. దాంతో వారి భుజాలపై చేతులు వేసి అతి కష్టంగా పంత్ మైదానం వీడాడు. పంత్ పరిస్థితిని చూస్తుంటే గాయం తీవ్రత ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. రవీంద్ర జడేజా వేసిన 37వ ఓవర్లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ ఆఖరి బంతిని కాన్వే డ్రైవ్ ఆడే ప్రయత్నం చేశాడు. కానీ బంతిని అంచనా వేయడంలో అతను విఫలమయ్యాడు. బ్యాట్ను మిస్సైన బంతి ఆఫ్ స్టంప్కు దగ్గరగా వెళ్తూ రిషభ్ పంత్ కుడి మోకాలికి బలంగా తాకింది. ప్యాడ్స్ కవర్ కాకపోవడం.. రోడ్డు ప్రమాదంలో అక్కడే తీవ్ర గాయం కావడంతో పంత్ కుప్పకూలాడు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో అతను మైదానం వీడాడు. రిషభ్ పంత్ స్థానంలో ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ చేస్తున్నాడు. ఒకవేళ రిషభ్ పంత్కు తీవ్ర గాయమైతే టీమిండియాకు కోలుకోలేని దెబ్బ పడుతోంది. ఈ సిరీస్ కంటే ఆస్ట్రేలియా పర్యటనకు రిషభ్ పంత్ ఉండటం కీలకం. ఈ మ్యాచ్లోనూ రిషభ్ పంత్(20) టాప్ స్కోరర్గా నిలిచాడు. ఇటీవల బంగ్లాదేశ్తో ముగిసిన టెస్ట్ సిరీస్లోనూ రిషభ్ పంత్ సెంచరీతో చెలరేగాడు. ఘోర రోడ్డు ప్రమాదంతో రెండేళ్ల పాటు టెస్ట్ ఫార్మాట్కు దూరంగా ఉన్న పంత్.. ఇటీవలే రీఎంట్రీ ఇచ్చాడు. అంతలోనే మళ్లీ గాయపడటం.. అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది. ఈ మ్యాచ్లో టాస్ గెలిచి బ్యాటింగ్కు దిగిన టీమిండియా తొలి ఇన్నింగ్స్లో 46 పరుగులకే కుప్పకూలింది. రిషభ్ పంత్(49 బంతుల్లో 2 ఫోర్లతో 20), యశస్వి జైస్వాల్(63 బంతుల్లో ఫోర్తో 13) మాత్రమే డబుల్ డిజిట్ స్కోర్ చేయగా.. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్కే పరిమితమయ్యారు. ఐదుగురు బ్యాటర్లు ఖాతా తెరవకుండానే వెనుదిరిగారు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ(5/15), విలియమ్ ఓ రౌర్కే(4/22), టీమ్ సౌథీ(1/8) భారత్ పతనాన్ని శాసించారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే సొంతగడ్డపై టీమిండియాకు ఇదే లోయేస్ట్ స్కోర్. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ నిలకడగా ఆడుతోంది. 41 ఓవర్లు ముగిసే సరికి 3 వికెట్లకు 161 పరుగులు చేసింది. క్రీజులో రచిన్ రవీంద్ర(17 బ్యాటింగ్), డారిల్ మిచెల్(4 బ్యాటింగ్) ఉన్నారు. టామ్ లాథమ్(15) విఫలమైనా.. డెవాన్ కాన్వే(91), విల్ యంగ్(33) రాణించారు. భారత బౌలర్లలో అశ్విన్, కుల్దీప్ యాదవ్, జడేలా తలో వికెట్ తీసారు. టామ్ లాథమ్(15) విఫలమైనా.. డేవాన్ కాన్వే(67 బ్యాటింగ్), విల్ యంగ్(24 బ్యాటింగ్) సూపర్ బ్యాటింగ్తో 31 ఓవర్లు ముగిసే సరికి 111 పరుగులు చేసింది.

## ఆ నిర్ణయమే టీమిండియా కొంపముంచింది



న్యూజిలాండ్తో తొలి టెస్ట్లో టీమిండియా బ్యాటింగ్ వైఫల్యానికి దూకుడే ప్రధాన కారణమని దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే అన్నాడు. భారత బ్యాటర్లలో ఓపిక లోపించిందని అభిప్రాయపడ్డాడు. అసలు సిసలు టెస్ట్ ఫార్మాట్ బ్యాటింగ్ ఆడటం లేదన్నాడు. బెంగళూరు వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్లో టీమిండియా 46 పరుగులకే ఆలౌటైన విషయం తెలిసిందే. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే సొంతగడ్డపై భారత్కు ఇదే అత్యల్ప స్కోర్ కావడం గమనార్హం. టీమిండియా ఆటతీరుపై అనిల్ కుంబ్లే అసంతృప్తి వ్యక్తం చేశాడు. టీమ్ మేనేజ్మెంట్ అనాలోచిత నిర్ణయాలే రోహిత్ సేన కొంపముంచాయని అభిప్రాయపడ్డాడు. విరాట్ కోహ్లీని ఫస్ట్ డౌన్లో ఆడించడం ఘోర తప్పిదమన్నాడు. ఓ అధికారిక బ్రాడ్కాస్టర్తో మాట్లాడిన అనిల్ కుంబ్లే.. పిచ్ మరీ బ్యాటింగ్కు ప్రతికూలంగా లేదని చెప్పాడు. 'విరాట్ కోహ్లీ నాలుగో స్థానంలో ఆడాలి. ఆ స్థానంలో అతనే టాప్ బ్యాటర్. మూడో స్థానంలో చతేశ్వర్ పుజారా వంటి క్లాస్ బ్యాటర్ బ్యాటింగ్ చేయాలి. సుదీర్ఘ కాలం పాటు అతను నెంబర్ 3 బ్యాటర్గా సేవలు అందించాడు. పుజారా జట్టులో ఉండి ఉంటే.. ఇన్నింగ్స్కు అడ్డుగోడలా నిలబడేవాడు. బంతి మీదకు వచ్చే వరకు ఆగి ఓపిగ్గా ఆడేవాడు. జట్టులో అలాంటి క్లాస్ ప్లేయర్ లోపించాడు. ఆ తరహా క్లాస్ బ్యాటింగ్ కూడా లోపించింది. ఈ విషయంలో టీమిండియా మేనేజ్మెంట్ పునారాలోచన చేయాలి. లేకుంటే ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోంది.'అని అనిల్ కుంబ్లే చెప్పుకొచ్చాడు. సుమారు పదేళ్ల పాటు పుజారా.. టీమిండియాలో మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. తనదైన జిడ్డు బ్యాటింగ్తో ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్లు ఆడాడు. వరల్ టెస్ట్ ఛాంపియన్షిప్ ఫైనల్ తర్వాత అతన్ని టీమిండియా మేనేజ్మెంట్ పక్కన పెట్టేసింది. శుభ్మన్ గిల్ అతని స్థానంలో ఆడుతున్నాడు. అయితే తాజా మ్యాచ్కు గిల్ దూరం కావడంతో కోహ్లీ మూడో స్థానంలో బ్యాటింగ్కు రావాల్సి వచ్చింది. దాదాపు 8 ఏళ్ల తర్వాత కోహ్లీ మూడో స్థానంలో బ్యాటింగ్కు వచ్చాడు. రోహిత్ శర్మ ఔటవ్వగానే.. క్రీజులోకి వచ్చిన కోహ్లీ డకౌట్గా వెనుదిరిగాడు. వెనువెంటనే వికెట్లు పడటంతో తర్వాతి బ్యాటర్లపై ఒత్తిడి నెలకొంది. దాంతో భారత బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలింది.



## అనుపమ డ్రాగన్

ఈ ఏడాది 'టిల్లు స్క్వేర్'తో కుర్రకారుని ఉర్రూతలూగించింది అందాల తార అనుపమ పరమేశ్వరన్. ప్రస్తుతం కథల ఎంపికలో జోరు ప్రదర్శిస్తున్న ఈ భామ.. ఇప్పుడు మరో కొత్త కథతో సినీప్రియుల్ని మెప్పించడానికి ముస్తాబవుతోంది. ఆమె, తమిళ కథానాయకుడు ప్రదీప్ రంగనాథన్ జంటగా నటిస్తున్న చిత్రం 'డ్రాగన్'. 'ఓ మై కడవులే' ఫేమ్ అశ్వత్ మారిముత్తు దీన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఫస్టుక్ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది అనుపమ. ఇందులో కీర్తి పాత్రలో కనిపించనుందామె. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఏజీఎస్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై కల్పతి ఎస్.సురేశ్, కల్పతి ఎస్.గణేశ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 'పరదా', 'బైసన్', 'లాక్డౌన్' లాంటి చిత్రాలతో బిజీగా ఉంది అనుపమ.

## ఒకే రోజు.. రెండు సినిమాల షూటింగ్స్..



ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ భామ ఖాతాలో పవన్ కల్యాణ్ నటిస్తోన్న హరి హర వీరమల్లు , ప్రభాస్ నటిస్తోన్న రాజాసాబ్ సినిమాలున్నాయి. జ్యోతి కృష్ణ డైరెక్ట్ చేస్తున్న హరి హర వీరమల్లు చిత్రీకరణ విజయవాడలో కొనసాగుతున్న విషయం తెలిసిందే. మరోవైపు రాజాసాబ్ షూటింగ్ హైదరాబాద్లో కొనసాగుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఒకేసారి రెండు సినిమాల షూటింగ్స్లో పాల్గొంటూ బిజీగా ఉంది నిధి అగర్వాల్. ఈ విషయాన్ని ఎక్స్ ద్వారా షేర్ చేసుకుంది. కళాకారుల జీవితం సృజతో నిండి ఉంటుంది. కానీ కొందరు మమ్మల్ని నిజంగా ఆశీర్వదించినట్టు.. కృతజ్ఞతతో అనుభూతి చెందేలా చేస్తారు. ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెండు పాన్ ఇండియా సినిమాలను ఒకే రోజున షూట్ చేసినందుకు సంతోషిస్తున్నా. అది కూడా ఒక సినిమా ఆంధ్రాలో.. మరో సినిమా తెలంగాణలో. రెండు రాష్ట్రాలు, ఒకే రోజు రెండు సినిమా షూటింగ్స్. మేమంతా ఏం చేశామో చూడాలని మీరంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఖచ్చితంగా ఈ రెండు సినిమాలు వేడుకగా జరుపుకునేలా ఉండబోతుతున్నాయని ట్వీట్ చేసింది. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో హరిహర వీరమల్లు రెండు పార్టులుగా వస్తోంది. మారుతి డైరెక్టర్ చేస్తున్న రాజాసాబ్ హార్రర్ కామెడీ జోనర్లో వస్తోంది.

## సోషల్ మీడియాకే చెమటలు పట్టిస్తోన్న 'దేవర' సిన్నది..



పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటిన చిత్రం దేవర. ఆరేళ్ల తర్వాత ఎన్టీఆర్ సోలోగా నటించిన ఈ భారీ విజయాన్ని అందుకుంది. సెప్టెంబర్ 27న విడుదలైన ఈ మూవీ ఇప్పటివరకు రూ.500 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి సరికొత్త రికార్డ్ సృష్టించింది. రీల్స్ చేస్తూ నెట్టింట తెగ హడావిడి చేస్తుంది. అలాగే మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య తోపాటు మరికొన్ని చిత్రాల్లోనూ ఆర్టిస్టుగా కనిపించి ప్రేక్షకులను అలరించింది లతా రెడ్డి. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఈ భామ.. తాజాగా బ్లాక్ శారీలో క్రేజీ ఫోటోషూట్ చేసింది. ఈ బ్యూటీ లేటేస్ట్ ఫోటోస్ నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి. నెట్టింట ఈ అమ్మడుకు మంచి ఫాలోయింగ్ ఉంది. దేవర తో ఈ అమ్మడుకు మరింత క్రేజ్ వచ్చింది. దీంతో సోషల్ మీడియాలో లతాకు ఫాలోయింగ్ కూడా పెరిగిపోయింది. దీంతో అటు తెలుగులో ఈ బ్యూటీకి ఆఫర్స్ రావడం ఖాయమంటున్నారు ఫ్యాన్స్.

## వరుస సినిమాలతో బిజీగా ఉన్న సిద్ధు



టిల్లు స్క్వేర్ తో మరో సూపర్ హిట్ అందుకున్న సిద్దూ జొన్నలగడ్డ, నెకట్స్ మూవీకి రెడీ అవుతున్నారు. మూడు నాలుగు సినిమాలు ఒకేసారి ఓకే చేసిన ఈ యంగ్ హీరో తన ఇమేజ్కు డిఫరెంట్ జానర్స్ ట్రై చేస్తున్నారు. స్టైలిష్ మూవీతో పాటు ఫోక్లోర్, ఫాంటసీ జానర్లను కూడా ట్రై చేస్తున్నారు. చాలా రోజులుగా టాలీవుడ్లో సినిమాలు చేస్తున్నా... డీజే టిల్లుతోనే స్పెషల్ ఐడెంటిటీ తెచ్చుకున్నారు యంగ్ హీరో సిద్దూ జొన్నలగడ్డ. టిల్లు పాత్రలో సిద్దూ నటనకు ఆడియన్సే కాదు, స్టార్ హీరోలు కూడా ఫిదా అయ్యారు. అందుకే ఆ సీక్వెల్ కూడా ఆడియన్స్కు బాగా కనెక్ట్ అయ్యింది. టిల్లు స్క్వేర్ తరువాత మోస్ట్ వాంటెడ్ హీరోల లిస్ట్లో చేరారు సిద్దూ. అందుకే ఈ హీరోతో సినిమాలు చేసేందుకు చాలా మంది దర్శకులు పోటి పడ్డారు. అయితే ఎవరిన్నీ నిరాశపరచకుండా అందరికీ టైమ్ ఇస్తున్నారు టిల్లు. కేసారి నాలుగైదు సినిమాలు చేస్తూ ఫుల్ టైమ్ సెట్లోనే గడిపేస్తున్నారు. ప్రజెంట్ నీరజ కోన దర్శకత్వంలో తెలుసు కదా, బొమ్మరిల్లు భాస్కర్తో జాక్ సినిమాల్లో నటిస్తున్న సిద్దూ. పరుశురామ్ డైరెక్షన్లోనూ చేసేందుకు ఓకే చెప్పారు. వీటితో పాటు తన ఇమేజ్ను మార్చిన టిల్లు సిరీస్లో థర్డ్ ఇన్స్టాల్మెంట్ను కూడా ఎనౌన్స్ చేశారు. ఈ సినిమాలు లైన్లో ఉండగానే దసరా సందర్భంగా రవికాంత్ పెరుపు దర్శకత్వంలో కోహినూర్ అనే ఫోక్లోర్ మూవీ చేస్తున్నట్టుగా ఎనౌన్స్ చేశారు. ఇలా వరుస లతో ఫ్యాన్స్ను ఎంగేజ్ చేసేందుకు కష్టపడుతున్నారు సిద్దూ జొన్నలగడ్డ.

Printed and Published by **VUPPARI RAMESH KUMAR** on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, **EDITOR: VUPPARI RAMESH KUMAR**. **RNI Reg No.TELTEL/2016/72952**.